ప్రజాశక్తి ఆదివారం అనుబంధం



నాకు స్ఫూర్తినిచ్చిన పుస్తకం

ఏప్రిల్ 05, 2009

39291



పొలిటికల్ అంపైర్

కె. చిన్నప్ప భారతి

'గని' సీరియల్ ప్రారంభం

హ్యాపీబర్త్‌డే

(2009 ఏప్రిల్ 5 నుంచి
2009 ఏప్రిల్ 11 వరకు)

కె. ప్రదీప్
7సం॥, ఏప్రిల్-5
మాధవి-బసవయ్య
పిల్లాయిపల్లి-నల్లగొండ

ఎం. తేజశ్విని
2సం॥, ఏప్రిల్-5
భాను-పైడిబాబు
విజయనగరం

సాయి సందీప్
7సం॥, ఏప్రిల్-2002
రమాదేవి-శ్రీనివాస్
అశ్వాపురం-ఖమ్మం

బి. సౌమ్య(సోని)
ఏప్రిల్
పద్మావతి-శ్రీనివాసరావు
జియమ్మవలస-విజయనగరం

ఎస్. పవన్‌సాయి రుత్విక్
ఏప్రిల్
స్వరాజ్యలక్ష్మి-ఎస్. ఆర్. శాస్త్రి
శ్రీనివాసనగర్-సికింద్రాబాద్

ఎ. వసుధ
1సం॥, ఏప్రిల్-10
దాక్షాయణి-సుబ్రమణ్యం
రామాపురం-చిత్తూరు

పి. విజయసాయి
1సం॥, ఏప్రిల్-10
శాంతకుమారి-నాగేశ్వరరావు
తెల్దారుపల్లి-ఖమ్మం

బి. సునంద-సుశాంత్
ఏప్రిల్
సుష్మ-స్వామిదాస్
ముషీరాబాద్-హైదరాబాద్

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి
ప్లాట్ నెం. 21/1, ఎం.హెచ్ భవన్
అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగం పల్లి,
హైదరాబాద్-500 020

మనలో మాట

కోతల కాలం

ఏదైనా కానివ్వండి, చేయడం కన్నా 'కోయడం' ఈజీ అనుకుంటాం. తరచి చూస్తే- ఇది మరీ అంత వీజీ కాదు. కొంత కోయటానికి కూడా ఎంతో తెలుసుండాలి. అందుకే 'కోయడం' కూడా ఒక కళ. 'కోతలు'పై ఇప్పటివరకూ ప్రత్యేకమైన పరిశోధన జరిగినట్టు లేదు కానీ, జరిగితే మాత్రం- బోలెడు సిద్ధాంత గ్రంథాలు రాసేటంత లోతైన సబ్జెక్టు.

ఎవరిని ఎప్పుడు పట్టాలో, పట్టి నమ్మకంలోకి ఎలా నెట్టాలో, పట్టువిడుపులు పాటిస్తూ ఎలా కట్టిపడేయాలో... కోతలరాయుళ్లకు తెలిసినంతగా మరెవరికీ తెలీదు. కోత రోతగానో, మోతగానో మారిపోకుండా జాగ్రత్త పడితేనే- కోతలకు కొంతకాలమైనా ఆదరణ, నమ్మకం ఏర్పడతాయి. ఇదంతా సవ్యంగా సాగిపోవాలంటే- కోతల వీరులకు చారిత్రిక, భౌతిక, శాస్త్ర, సాంకేతిక, మానసిక, భౌగోళిక ... తదితర శాస్త్రాల్లో కొంతైనా ప్రవేశమూ, ప్రావీణ్యమూ ఉండి తీరాలి. మరి ఇంత పాండిత్యమూ, పరిజ్ఞానమూ ఉన్న 'కోతలరత్న'లను, రాయుళ్లను కళ్లారా చూడాలంటే- ఎన్నికలకు మించిన మంచి సీజను మరొకటి లేదు. ఇప్పటికిప్పుడు మండుటెండను పండువెన్నెలగా, బీడుభూమిని హరితవనంగా, ఆకలిదుఃఖాన్ని ఆనందభాష్పంగా మార్చగలిగిన అభినవ మయులను, మాయావులను ఎన్నికల వేళనే తిలకించవచ్చు.

డెల్టా ప్రాంతంలో వరికోతలు ముమ్మరంగా సాగే సమయం కూడా ఇదే! ఎప్పుడూ లేనిది ఈసారి రైతుల చేనుకోతకు ముందే నేతల మాటల నూర్పిడి మొదలైంది. దిగుబడి ఇంతంటే అంతని ఒకటే 'కోత!'. నిజం దిగుబడి మరికొద్ది రోజుల్లో ఎలాగూ అనుభవంలోకి వస్తుంది. బహుశా దానిని బట్టి ఎన్నికల్లో రైతుల 'నూర్పిడీ' ఉండొచ్చు.

ఈ మాటలు రాస్తున్నప్పడే మరొక కోత అనుభవంలోకి వచ్చింది. అది వేళాపాళాలేని విద్యుత్తు కోత. చికాకు కలిగించే ఉక్కపోత. నాణ్యమైన విద్యుత్, అంతరాయం లేని సరఫరా వంటి మాటలు వట్టి 'కోతలే' అన్న వాస్తవం ఇలాంటప్పడే తెలిసొస్తోంది. 'కోతలు' ఎక్కువయ్యేకొద్దీ రోత కలగడం ఖాయం. ఈ మోత ఎందుకనే అభిప్రాయం కలగడమూ సహజం. అది అలా అలా పరిణమించి, పరాక్రమించి నేతలను, వారి తలరాతలను మార్చే చేతనగా మారవచ్చు. మార్పుకు దారి తీయవచ్చు.

★

ఈ సంచికలో....

టపా	...	2
సీరియల్	...	6
స్ఫూర్తి	...	8
బాలనేస్తాలు	...	12
అట్టమీద కథ	...	14
చూద్దామా	...	18
సలహాలు	...	20
కథ	...	21
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...



రుచి ...3

మినపప్పు వడియాలు

కూల్‌కూల్‌గా ...4

ఎండకైనా... వానకైనా...



ఆరోగ్యం ... 10

మూర్ఛవ్యాధి అవగాహన - జాగ్రత్తలు

బాలనేస్తాలు ... 12

బీర్బల్ కథ



ఆలోచింపచేసిన కథనం

'ఖరీదైన పెళ్లిళ్లు - మారుతున్న సాంప్రదాయాలు' కవర్ స్టోరీ వాస్తవానికి దగ్గరగా ఆలోచింపచేసేదిగా ఉంది. జయ లలిత పెంపుడు కొడుకు పెళ్లి, లాలూ కూతురు పెళ్లి ఆడంబరాలు జగమెరిగిన సత్యం. పెళ్లిళ్లలో ఆర్భాటాలు ఎంత తగ్గిస్తే ఆరోగ్యానికి అంత మంచిది.

బి. రాజేశ్వర్, పొన్కల్, ఆదిలాబాద్.

హృదయాలను తాకిన '...కోయిల'

మమతానురాగాల సమాహారం ఆదివారం అనుబంధం స్నేహ. పాఠకులను బాగా అలరిస్తోంది. వారం వారం సరికొత్త వరవడిని సృష్టిస్తూ పాఠకులను రంజింపచేస్తోంది. అలాగే ఈ ఆదివారం అనుబంధంలో కూడా మంచి మంచి అంశాలను తీసుకుని చాలా విషయాలను శ్రోతలకు అందించారు. అందులో భాగంగా "ఖరీదైన పెళ్లిళ్లు- మారుతున్న సాంప్రదాయాలు" చాలా బాగుంది. ఎన్నో తెలియని విషయాలు దీని ద్వారా తెలుసుకోవడం జరిగింది. అలాగే మనలోమాటగా కూయవే ఓ కోయిలా హృదయాలను తాకింది. ప్రకృతి ఒడిలో ఓలలాడుతూ పచ్చని చెట్లపై కుహుకుహు అంటూ వసంతకోకిల గానామృతాన్ని పంచుతుంటే ఆ ఆనందం మధురానందం. అందుకే మీ స్నేహ ఆదివారం అనుబంధాన్ని మా స్నేహలాగా భావించి ఆదివారం కోసం నా మనసు ఆరాటపడుతుంటుంది. మీకూ మీ పత్రికాధిపతులకు, రచయితలకు, కార్టూనిస్టులకు అభినందనలు.

మదీనా, అబిద్ నగర్, విశాఖపట్నం.

'కథాత్మ' బాగుంది

మార్చి 22 నాటి స్నేహ సంచికలో అట్టమీది కథగా శాస్త్రిగారి రచన 'ఖరీదైన పెళ్లిళ్లు...' మారుతున్న సాంప్రదాయాలు ఆసక్తికరంగా ఉంది. పాట్నాను ప్రత్యక్షంగా చూసిన విధంగా పాట్నా పరిసర దర్శనీయ ప్రదేశాల విశేషాలను అందించటం అభినందనీయం. అంతరించిపోతున్న కళారూపం తోలుబొమ్మలాటను తిరిగి ఈ తరం వారికి పరిచయం చేయవలసిన అవసరం ఎంతో ఉంది. కథాత్మ కథ బాగుంది. ఆరోగ్యం శీర్షిక ద్వారా శుక్లం వస్తే తీసుకోవాల్సిన (లక్షణాలు, చికిత్స) చర్యల గురించి అవగాహన కల్గించారు. వి. రామకృష్ణ గారి కార్టూన్లు ఆకట్టుకుంటున్నాయి. కేకుగొను, హృదయ భాష దృశ్యాలు ముచ్చటగా ఉన్నా కురూపి పిల్లి దుస్థితికి 'అయ్యో' అనుకున్నాం. మనలో మాటలో పేర్కొన్న 'కోయిలమ్మ' నిరాశకు మనందరమూ కారణమే. కనీసం క్షమాపణలైనా అడుగుదాం కోయిలమ్మని. అంతకుమించి ఇపుడేం చేయగలం? వృక్షో రక్షిత రక్షితః!! కొత్త శీర్షిక 'ప్రేరణ'ను ఆహ్వానిస్తూ....

నేమాన సుభాష్ చంద్రబోస్, ఇలిసిపురం, శ్రీకాకుళం.

బాధపడ్డాం

నేటి సినిమాల ప్రభావంతోగానీ, ఆర్థిక స్థోమతల పోటీతత్వం వల్లగానీ పెళ్లి ఖర్చు విషయంలో అనూహ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయి. తమదైన ప్రత్యేకతను చాటుకునే విధంగా నిర్వహింపబడుతున్న నేటి వివాహ వేడుకలను గురించిన ఆసక్తికర విషయాలను అట్టమీది కథ ద్వారా తెలుసుకున్నాం. ఖరీదైన పెళ్లి పత్రికలను ముద్రించటంతోపాటు పెళ్లి మండపాల అలంకరణ వరకు వినూత్న ప్రత్యేకతలను కల్గి ఉంటూ ఆహ్వానితుల దృష్టిని ఆకట్టుకునేలా మారుతున్న వివాహాల నిర్వహణ అభినందనీయమే. అయినా సాంప్రదాయక చిహ్నాలయిన సన్నాయిమేళం, పురోహితుల పాత్ర నామమాత్రమే అవడం బాధాకరం! అలాగే పండుగలు, పబ్బాల సమయంలో ఒకప్పుడు విశేషంగా ఆకట్టుకున్న తోలుబొమ్మలాట నేడు నిరాదరణకు గురికావడాన్ని గురించి చదివి బాధపడ్డాం. ఇలాంటి కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యతను ప్రభుత్వమే కాక ప్రయివేటు సంస్థలు కూడా చేపడితే ప్రయోజనకరంగా ఉండగలదు. రుచి శీర్షిక ద్వారా వివిధ ఐస్‌క్రీంల తయారీ విధానాలను తెలుసుకున్నాం. ఐస్‌క్రీంలను ఈజీగా తయారుచేయడం తెలియజేయడం అభినందనీయం.

గొల్లమండల సురేష్ కుమార్, సీతారాంపురం, ఖమ్మం.

మరెన్నో రావాలి

మార్చి 22 వ తేదీ స్నేహలో మీరు అందించిన తోలుబొమ్మలాట చదువుతుంటే మాకు మళ్లీ తోలుబొమ్మలాట చూస్తున్నట్టుగా వుంది. ఇలాంటివి మరెన్నో అందించాలని కోరుతున్నాం. ఖరీదైన

పెళ్లిళ్లు మధ్యతరగతి ప్రజానీకానికి భూలోక స్వర్గంలా మారాయి.

విజయ్, గుంటూరు.

చక్కగా వివరించారు

మార్చి 22వ తేదీ ఆదివారం సంచికలో తోలుబొమ్మలాట గురించి చక్కగా విశదీకరించారు. ఈనాటి వారికెందరికో తెలియని ఈ తోలుబొమ్మలాటలు జానపద కళా రూపాల్లో ప్రసిద్ధి చెందినవవి. నేటి పపెట్ షోకు అవే మూలం. ఈ కళాకారులను ప్రభుత్వం తగిన రీతిలో గుర్తించి ఉపాధి కల్పించాలి.

ఆచార్య నూతినారాయణరావు, గడ్డి అన్నారం, హైదరాబాద్.

కథలకు ఆహ్వానం

మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతుంటాయి. వీటిలో ఎన్నో సంఘటనలు మనసును మెలిపెడుతుంటాయి. అవి సామాజికమైనవి కావచ్చు. ఆర్థికమైనవి కావచ్చు. మరేవైనా కావచ్చు. వాటిని ప్రతిబింబించే... బాధితులను చైతన్యపరిచే... సామాజిక స్పృహ కలిగించే... కథలను మాకు పంపండి. ప్రచురిస్తాం. ఆకర్షణీయమైన పారితోషికం వుంటుంది. అయితే తెల్లకాగితం మీద ఒకవైపు మాత్రమే రాయాలి. రాతలో ఏడు కాగితాలకు మించకూడదని మనవి.

మా చిరునామా:

కథ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.

మినప్పప్పు వడియాలు

కావలసిన వస్తువులు

మినప్పప్పు - 1కిలో, జీలకర్ర - కొద్దిగా
పచ్చిమిర్చి లేక పచ్చికారం - 50 గ్రాములు
ఉప్పు - సరిపడా, వెల్లుల్లి - 1 పాయ

తయారుచేయు విధానం

రాత్రి పూట మినప్పప్పు నానబెట్టి పొద్దున పొట్టంతా కడిగి శుభ్రంచేసి నీళ్ళు కొద్దికొద్దిగా పోసుకుంటూ మెత్తగా రుబ్బుకోవాలి. రుబ్బేటప్పుడే ఎల్లిపాయ, జీలకర్ర, పచ్చిమిర్చి లేక పచ్చికారం, ఉప్పు వేయాలి. పల్చటి తడిపిన బట్టగానీ లేదా పాలిథిన్ పేపర్ గానీ తీసుకుని దాని మీద రుబ్బిన పిండిని చిన్న గోలీలంత లేదా చింత గింజలంత సైజులో ఉండలుగా పెట్టి వీటిని ఎండలో పెట్టుకోవాలి. సాయంత్రానికి ఎండి ఊడి వస్తాయి. వీటిని ఇంకో రెండు రోజులు బాగా ఎండలో పెట్టి పొడి డబ్బాలో పోసుకుంటే చాలా రోజులు నిల్వ ఉంటాయి. వీటిని ఎప్పుడు కావాలంటే అప్పుడు నూనెలో వేయించుకోవచ్చు.



గోరు చిక్కుడుకాయ వడియాలు



కావలసిన వస్తువులు

మినప్పప్పు - అరకేజీ
గోరుచిక్కుడు - పావుకేజీ
పచ్చిమిర్చి - కారం సరిపడా
అల్లం - అంగుళం ముక్క
జీలకర్ర - కొంచెం
నువ్వు పప్పు - చారెడు

తయారు చేయు విధానం

మినప్పప్పు ముందురోజు నానపెట్టి మరునాడు కడిగి మెత్తగా రుబ్బుకోవాలి. గోరు చిక్కుడుకాయల్ని సన్నగా తరిగి ఉంచుకోవాలి. పచ్చిమిర్చి , అల్లం, ఉప్పు, వేసి మెత్తగా నూరుకొని చిక్కుడు ముక్కలు కూడా వేసి దంచి దానిని రుబ్బుతున్న పిండిలో వేసి కలియబెట్టాలి. ఈ పిండిని కూడా అన్ని వడియాలు మాదిరిగానే తడిబట్టమీద గానీ పాలిథిన్ కవర్ మీద గానీ పెట్టుకోవాలి. బాగా ఎండాక డబ్బాలో పోసుకోవాలి.

సగ్గుబియ్యం వడియాలు

కావలసిన వస్తువులు

సగ్గుబియ్యం - 1కిలో, పచ్చిమిర్చి - 10
అల్లం - కొంచెం, ఉప్పు - సరిపడినంత
జీలకర్ర - కొద్దిగా

తయారు చేయు విధానం

సగ్గుబియ్యం కడిగి కొద్దిగా నీరు పోసుకుని నానబెట్టుకోవాలి. ఒక డబ్బా సగ్గుబియ్యానికి 5 డబ్బాలు నీళ్ల కావాల్సి వస్తుంది. నీరు మరగబెట్టుకోవాలి. మరిగేటప్పుడే అందులో అల్లం, పచ్చిమిర్చి, జీలకర్ర, ఉప్పు మెత్తగా నూరి వేయాలి. నానబెట్టుకున్న సగ్గుబియ్యాన్ని కూడా అందులోనే వేసి ఉడకబెట్టాలి. సగ్గుబియ్యం ఉడికిన తర్వాత స్టౌపైనుండి దించి కొంచెం ఆరనివ్వాలి. ఎండలో పెట్టిన పాలిథిన్ కవర్ లేదా తడిబట్టపై చిన్న స్పూన్ తో కొంచెం కొంచెం బిళ్లలుగా వేసుకోవాలి. ఇవి బాగా ఎండాక పేపర్‌నుండి ఊడిపోయి వస్తాయి. వీటిని ఇంకా రెండు మూడు రోజులు ఎండలో పెట్టుకుంటే చాలు. ఇవి పప్పుచారులో, పప్పుకూరల్లో నంజుకోవడానికి చాలా బావుంటాయి. పిల్లలు ఇష్టంగా తింటారు.

బొంబాయి రవ్వ వడియాలు

కావలసిన వస్తువులు

బొంబాయి రవ్వ - అరకిలో
ఉప్పు - తగినంత
మిర్చి - కారం సరిపడా
నువ్వు పప్పు - చారెడు

తయారు చేయు విధానం

గ్లాసుతో రవ్వ కొలుసుకుని దానికి మూడు రెట్లు నీళ్లు గిన్నెలో పోసి స్టౌపై పెట్టాలి. ఉప్పు, పచ్చిమిర్చి కలిపి నూరుకొని నీళ్లు మరిగేటప్పుడు అందులో వేయాలి. తర్వాత రవ్వ వేసి తిప్పుకొని మరీ జారుగా కాకుండా మరీ ముద్దగా కాకుండా ఉడకపెట్టుకోవాలి. ఉడికిన తర్వాత స్టౌమీద నుండి దింపుకోవాలి. దానిని తడిబట్టమీద చక్రాల గిద్దెలలో పెట్టి చిన్న చిన్న చక్రాలుగా వత్తుకుని ఎండలో పెట్టుకోవాలి. ఎండిన తర్వాత వీటిని వేయించుకుంటే చాలా రుచిగా వుంటాయి.

కూల్‌కూల్‌గా...

ఎండకైనా... వానకైనా!

డా॥ కాకర్లమూడి విజయ్

గొడుగు -ఛత్రం- మొదటినుండి ఒక దర్పానికి, దర్జాకి, హోదాకి గుర్తుగా వస్తోంది. ఈ కాలం వాళ్ళు గొడుగు పట్టుకోడానికి సిగ్గు పడుతున్నారు. గొడుగు వాడకం -అంటే అచ్చంగా ఎండకో, వానకో మాత్రమే కాకుండా -చాలా ప్రాచీన కాలం నుండి వస్తోంది. అతి ప్రాచీన ఈజిప్టు, గ్రీసు, అసిరియా ప్రాంతాల శిధిలాలలో దొరికిన చిత్రాలలో గొడుగు (ఛత్రం) వాడకం కనిపిస్తుంది. చైనీయులు రెండు వేల ఏళ్ల కిందటే గొడుగును కనుగొన్నారని చెబుతారు. తొలి రోజుల్లో ఈ గొడుగును ఎండ తీక్షణత నుండి తప్పించుకోడానికే వాడుతూవుండేవాళ్లు. చైనీయులే గొడుగును వాటర్‌ప్రూఫ్ చేసి వర్షంలో కూడా వాడవచ్చని కనుగొన్నారు.

ప్రాచీన గ్రీకు, రోమన్లు గొడుగును తమ దర్జాను ప్రదర్శించేందుకే వాడేవాళ్ళు. రోమ్‌లో నాటకాలు ప్రదర్శించే 'స్టేజి' పైభాగం మొత్తం కప్పలేక, ఎవరికి వారు గొడుగులను ఆశ్రయించేవాళ్లట. కాకపోతే అప్పటి గొడుగులు చర్మంతోనో, తోలు తోనో చేసినవి.

చరిత్ర ఆధారాల ప్రకారం మూసుకోగల గొడుగుని చైనీయులు క్రీ.శ 21వ శతాబ్దంలోనే రూపొందించారు. సాంప్రదాయ బద్ధంగా వాడబడే గొడుగులను రథాల కొరకు తయారు చేశారు (మన ఇతిహాసాల్లో కూడా రథాలకు ఛత్రాలు వుండేవని వుంది). అయితే ఈ తరహా మూసుకోగల గొడుగులు క్రీస్తుపూర్వం 6వ శతాబ్దంలోనే వుండేవనడానికి ఆధారాలున్నాయి.

తొలి రోజుల్లో సమాజంలో ఉన్నత వర్గాలకు మాత్రమే అందుబాటులో ఉన్న గొడుగులు క్రమేపీ ప్రజాబాహుళ్యంలోకి వచ్చాయి. పదహారవ శాతాబ్ది నుండి పాశ్చాత్య దేశాలలో గొడుగుల వాడకం ఊపందుకుంది. అప్పుడు కూడా గొడుగు స్త్రీలకు సంబంధించిన వస్తువే అనుకునే వాళ్ళు. జోనాస్ హన్వే అనే పర్షియన్ రచయిత, యాత్రికుడు సుమారు ముప్పైఏళ్ల పాటు ఇంగ్లండులో బహిరంగంగా గొడుగును వేసుకుని తిరిగేవాడు. దాంతో గొడుగుల వాడకం పురుషులకీ పాకింది. కొంతకాలానికి గొడుగు వాడినా, చేతకర్రలా వేళ్లాడేసుకుని వెళ్ళినా ఇంగ్లండులో మార్యాదస్తుల హస్తభూషణంగా వర్ధిల్లింది. గొడుగులంటే ముసలివాళ్లకి సంబంధించినవి మాత్రమే అనుకునే వాళ్లకోసం చిన్న చిన్న గొడుగులు కూడా పుట్టుకొచ్చాయి. ఎంచక్కా హ్యాండ్ బ్యాగుల్లో ఇమిడి పోగల గొడుగులు స్త్రీలకు మంచి తోడయ్యాయి. ఇంగ్లీషులో

ఎండాకాలం వచ్చి చాలా కాలమైంది. ఈ కాలంలో మనం వాడే ఒక ఉపకరణం గొడుగు. ఇప్పుడైతే రంగురంగుల గొడుగులు, బుల్లిబుల్లి గొడుగులు వచ్చాయి గానీ ఒకప్పుడు గొడుగంటే నల్లగా మాత్రమే ఉండేది. అవి ఇప్పటికీ ఉన్నాయనుకోండి... ఇలాంటి బోలెడన్ని విషయాలు చెప్పకుందామా!

గొడుగుని అంబ్రెల్లా అంటారు కదా... ఈ చిన్న గొడుగులను 'పారాసోల్' అంటారు. పురుషులు 'నల్ల' గొడుగులని వాడటానికి ఇష్టపడతారు. అందునా చెక్క హ్యాండిల్ ఉన్నవి నాణ్యమైనవి. గొడుగుల్ని మూసి, మధ్య కడ్డీ చుట్టూ తిప్పి, గుండీ పెట్టేస్తే అందమైన వాకింగ్ స్టిక్‌లా కూడా పనికివస్తుంది. ఈ చిట్కా తెలిసే ఇంగ్లీషు వాళ్ళు నెత్తిపై టోపీ పెట్టుకుని కూడా పడుగుల్ని గొడుగుల్ని చేతి కర్రలా తీసుకు వెళ్ళేవాళ్ళు!

ఇక రంగురంగుల, పూల పూల డిజైన్ల పాలియస్టర్ గొడుగులు ఆడవాళ్ళకు అదనపు అలంకరణలు. విచిత్రమేమిటంటే మనం ఎండల్లోకంటే వర్షాల్లోనే ఎక్కువగా గొడుగుల్ని బయటకు తీస్తాం. కానీ ఎండ నుండి సరైన రక్షణ నిచ్చేది గొడుగే -మరే ఖరీదైన క్రీములూ, లోషన్లూ కావు. ఎండాకాలంలో ఈదురు గాలులు తక్కువ. కాబట్టి గొడుగులు ఎగిరిపోతాయనే బెంగ కూడా ఉండదు! ఈ సమస్య వర్షాకాలంలో ఎక్కువ.

గొడుగుతో ఇంకా కొన్ని ప్రయోజనాలున్నట్టు అప్పుడప్పుడూ రుజువులు లభిస్తుంటాయి. పారాషూట్ డిజైన్ గొడుగు నుండే వచ్చిందంటారు. కొందరు గొడుగుని ఆయుధంగా వాడటం (కనీసం కుక్కల్ని తరిమేయడానికైనా) కూడా కద్దు. గొడుగుని చిన్న గుడారంలా వాడి తాత్కాలికంగా 'షాపుల్ని' నడిపే వాళ్ళున్నారు. ఈ మధ్యే గొడుగుని తిరగేసి, దానిలో సినిమా సడీలు అమ్ముతుండటం కనిపించింది. -సృజనాత్మకత మరి!

సరే గొడుగు చరిత్ర తెలిసింది కదా. మరి ఈ ఎండా కాలంలో గొడుగుల వాడకం ప్రారంభిద్దామా?

ప్రాచీన గ్రీకులు తమ బొమ్మలను చిత్రించేటప్పుడు తమ హోదాను తెలిపేందుకు గొడుగును కూడా గీయించుకునేవాళ్ళు!

★

★గొడుగు పెళ్ళిళ్ళలో కూడా చాలా మాంచి పాత్ర వహించేది. బ్రిట్టానీ ప్రాంతంలో ఈ నాటికీ పెళ్ళిచూపులు, నిశ్చితార్థాలూ గొడుగు వల్లే జరుగుతాయి! తనకు అమ్మాయి వచ్చిందని చెప్పడానికి ఆమె గొడుగును పట్టుకుంటానని అబ్బాయి అంటే -పెళ్లికి ప్రాపోజ్ చేసినట్టే!

★ప్రపంచంలో ఎన్ని గొడుగులు వాడబడుతున్నాయో తెలీకపోవచ్చు గానీ ప్రపంచంలో అత్యధికంగా గొడుగులు వాడేది మాత్రం ఇంగ్లండులోనే! అప్పట్లో ఇంగ్లండులో గొడుగులు స్థానికంగా తయారయ్యేవి. కానీ ఇప్పుడు హాంగ్ కాంగ్ జపాన్‌ల నుండి దిగుమతి -చేసుకుంటున్నారు. జపాన్ దేశం అమెరికాకు కూడా అధిక మొత్తంలో గొడుగులను ఎగుమతి చేస్తుంది. యాభయ్యవ దశకంలోనే జపాన్ ఒక సంవత్సరంలో 12 మిలియన్ల గొడుగుల్ని ఎగుమతి చేసింది.

★లండన్‌లో ఏటా లక్ష గొడుగులు పోతున్నట్లు నమోదైంది. ఆ కారణంగా వాటి కొనుగోళ్ళు పెరిగాయి. కానీ మంచి నాణ్యత గల గొడుగులు దాదాపు జీవితకాలం పనిచేస్తాయి.

★లండన్‌లో హోటళ్ళలో గొడుగు స్టాండ్ ఏర్పాటు చేసిఉంటుంది. అనుకోని వర్షాలు తరచూ పడుతుండటం వల్ల గొడుగుల వాడకం తప్పనిసరి. కానీ చాలా మంది తొందరలో గొడుగుల్ని స్టాండ్‌లోనే మర్చిపోయి వెళ్ళిపోయే వాళ్ళు. చాలామంది గొడుగులు దొంగతనానికి గురయ్యేవి. ఒకసారి ఒకతను గొడుగును స్టాండులో పెట్టి దానికో చీటి తగిలించాడు. చీటీపై "నేను బాక్సింగ్ ఛాంపియన్‌ని. మరో రెండు నిమిషాల్లో తిరిగివస్తాను"అని రాశాడు. హాయిగా లోపలికి వెళ్లి కాస్త మద్యం సేవించి వచ్చేసరికి అతని గొడుగు లేదు. కానీ తనురాసిన చీటీ వెనక ఇలా రాసివుండటం చూశాడు. "నీ గొడుగు ఇంగ్లండులోని ఛాంపియన్ రన్నర్ తీసుకెళ్ళాడు. అతను మరెప్పటికీ రాడు" అని.

సుప్రసిద్ధ తమిళ అభ్యుదయ రచయిత
కె.చిన్నప్పభారతి రాసిన 'గని' నవలను
సీరియల్‌గా ఈరోజునుంచి మీకు అందిస్తున్నాం.
తమిళంలో వున్న మూల కథను తెలుగులో
వి. వెంకటేశ్వర (చెన్నై) చక్కగా
అనువదించారు. యువకవియైన ఆయన ఈ
అనువాద రచనలో సైతం కవితాత్మకతను
ఆవిష్కరించారు. అనువాద ప్రతిని
ఎ.జి. యతిరాజులు సరిచూశారు.

గని

ఇద్దరు కాళ్ళు చాచుకుని పడుకొనే పాటి మట్టి గుడిసె, అడవి గడ్డితో కప్పబడి ఉంది. పైపూత లేని బయటి గోడ పగుళ్లలో క్రిమికీటకాలు, గట్టిపడిన గడ్డిలో, వాననీటి వల్ల ఏర్పడిన గుంతలో ఏవేవో మొలకలు, చెదలతోటలా.

అడ్డుగోడలేని ఆ గుడిసెలోనే జీవితం తాలూకు అన్ని అనుభవాలూ. అక్కడో నులకమంచం. పగటిపూట కూచోడానికి ఉపయోగపడుతుంది. రాత్రిపూట భార్యాభర్తలకు, పిల్లలకూ మధ్య అడ్డుగోడగా ఉపయోగపడుతుంది. ఎడమవైపున ఆలూమగలు, కుడివైపున ఇద్దరు మగబిడ్డలు. సిగ్గూ, సంకోచం అన్నవి ఏకాంతం లభించినప్పుడే. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఒకే గదిలో అందరూ కలిసి జీవిస్తున్నప్పుడు ఇవన్నీ మరుగున పడిపోతాయి. ఎదిగిన బిడ్డలు దాపుల పడుకొన్నప్పుడు కూడా శృంగారకేళి సాగుతూనే ఉంటుంది. గత్యంతరం లేని పరిస్థితి మానవ సహజమైన లజ్జను తరిమేస్తుందేమో! స్త్రీ, పురుషులు ఒకరినొకరు ఒరుసుకుంటూ ప్రయాణం చేస్తున్నప్పుడు సిగ్గూ, ఎగ్గూ అనే ధ్యాస ఉంటుందా!

తెల్లవారుజాము. గనిలో సైరన్ మోత వినిపించే సమయం. గని వాకిట్లో కార్మికులు గుమిగూడాల్సిన తరుణం. గుడిసె లోపల ఉన్నా వణికించే మంచు తలుపు తెరిస్తే, ఎదుట రూపం కనిపించనివిధంగా దట్టంగా మంచు. చెట్టుచేమల మీదా, ఇళ్లమీదా మంచు దుప్పటి. గుడిసెలో సమంగా లేని నేల మీద పరచిన చాప మీద పడుకొన్నాడు చంచల్‌కుమార్. సూదులతో పొడుస్తున్నట్టు పక్కటెముకల్లో నొప్పి. ఇటూ అటూ పొర్లి పొర్లి పడుకొంటూ నొప్పిని తగ్గించుకొన్నాడు.

రక్తం పీలుస్తోన్న జలగను ఒంటి మీంచి తీసి విసిరేసినట్టు, కనురెప్పల మీది నుంచీ నిద్రాదేవిని కసిరి కొట్టి, లేచి కూర్చొని, కళ్ళు నలుముకొంటూ ...

"చంపా! ఇద్దరూ లేచారా?" అని ఆవులిస్తూ భార్యను అడిగాడు. అతని మాట తడబడుతోంది.

ముందే లేచి, కుంపట్లో టీ కాస్తోన్న చంపాదేవి, "కోడి సైతం ఎగరలేనప్పుడు, పిల్లలు ఎగరగలవా!" అంది నర్మగర్భంగా.

చంచల్‌కుమార్‌ది విశాలమైన ఛాతీ, నొక్కులు పడ్డ చెంపలు, గూని దేహం. "నువ్వు చెప్పదలచుకొన్నదేదో అర్థమయ్యేలా చెప్పు" అన్నాడతను.

తన వాక్చాతుర్యానికి మురిసిపోతూ "వాళ్ళది లేతప్రాయం, పనిచేయడం కొత్త. అలసిపోయి పడుకొన్నారు. పనికి బాగా అలవాటు పడ్డ నువ్వే ఇప్పుడు లేచావు. వాళ్ళు నీకంటే ముందు లేస్తారా?" అంది పిల్లలు నిద్రపోవడాన్ని సమర్థిస్తున్న ధోరణితో.

తల్లి ప్రేమను గ్రహించిన వాడల్లా "సరే, టీ కాస్తోన్న వేణ్ణీళ్లతో వాళ్ళ మొహాలు కడిగేయ్. అంతకు ముందు నాకో గ్లాసు టీ ఇవ్వు" అంటూ, పళ్ళు తోముకోవడానికి బయటికెళ్ళాడు.

తల్లిదండ్రుల మాటల్ని వింటూ, మెలకువతోనే పడుకొని ఉన్న పిల్లలిద్దరూ, ఠంచనుగా పనికి వెళ్లాలన్న ఆదుర్దాతో లేచారు. చాపనైనా చుట్టి పెట్టకుండా అడ్డుగా ఉన్న నులకమంచాన్నీ జరిపిపెట్టకుండా బయటి కెళ్లారు. "మేం బయటికెళ్లి సంపాదించి తెచ్చేవాళ్ళం. ఇంటి పనులన్నీ నీ బాధ్యతే!" అని తల్లికి తెలియజేస్తున్నట్టు ఉంది వాళ్ళ ధోరణి.

ముగ్గురూ కాలకృత్యాలు తీర్చుకొని, మొగం కడుక్కొని ఇంట్లోకి వచ్చారు. పాలులేని టీ కషాయాన్ని ఓ అల్యూమినియం గ్లాసులో తెచ్చి ముగ్గురికీ ఇచ్చిందామె. క్రితం రాత్రి కాల్చిన రొట్టెల్ని కేరియర్లలో పెట్టి ఇచ్చింది!

ఎండ కన్నెరుగకుండా హాయిగా చదువుకోవాల్సిన వయసు. కానీ చిన్న వయసులోనే శ్రమించాల్సిన దుస్థితి. మామగారు గ్రామంలో నివసిస్తున్నారు. ఆయనకు వయోభారం, దృష్టిమాంద్యం. ఆయనకు తోడుగా వితంతు ఆడపడుచు. వీళ్ళకు జీవనోపాధిగా ప్రతినెలా కొంత డబ్బు పంపించాల్సిందే. ఒకరి రెక్కల కష్టంతో రెండు కుటుంబాలు మనుగడ సాగించలేవు. 'బాగా చదివే పిల్లలు, పెద్ద చదువులు చదివి, భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరుకోగల పిల్లలు' అని మెప్పు పొందిన పిల్లల చదువు ఆపించేయాలన్న నిర్ణయం తెలియగానే ఉపాధ్యాయులు స్వయంగా వచ్చి బడి మాన్పించకండని ఎంతగానో చెప్పిచూశారు. దిగంబరంగా ఉన్న స్త్రీకి రేపు దొరకబోయే పట్టుచీర కన్నా ఇప్పుడు దొరికే నూలుచీరే మేలని తోచడం సహజం. పిల్లల్ని బడి మాన్పించారు. మబ్బులు కురవకుండా చెదిరిపోయినట్టు చెదిరిపోయాయి వాళ్ల తల్లిదండ్రుల కలలు. రోజూ పొద్దున పిల్లల్ని చూడగానే ఆ తల్లి మనసు తల్లడిల్లుతుంది. ఆ పిల్లల లేత మనసుల్లోనూ బాధాగ్నిపర్వతం కుతకుతలాడుతోందేమో!

ఆమె కలలు కనడం మానలేదు. ఒక గేదెను పెంచింది. కుటుంబ పోషణ కోసం భర్త ఇచ్చే డబ్బుల్ని పొదుపుగా వాడుతూ తక్కువ వస్తువుల్ని కొనడం, కొద్దిగా ధర తక్కువ బట్టల్ని కొనడం, మంచిచెడ్డలు విచారించేందుకు చుట్టాల ఇళ్లకు వీలైనంతమేరకు నడిచే వెళ్ళడం, వంట చేసుకోవడం కోసం కంపెనీ వాళ్ళిచ్చే బొగ్గుల్ని ఆదా చేసి అమ్ముకోవడం వగైరా పద్ధతులతో ఆమె డబ్బు కూడబెట్టింది. ఓ

ఆవు కొని పాలమ్ముకోవాలనీ, పిడకలు తయారు చేసి అమ్మాలనీ అలా వచ్చే ఆదాయంతో పిల్లల్ని ఉన్నత స్థితికి తీసుకురావాలనీ కలలు కంది.

ఆమె కొన్న దూడ పెద్దదై ఈనే తరుణంలో, రాత్రి బాగానే ఉన్నదల్లా పొద్దున నిద్రలేవనేలేదు. పరామర్శించడానికి వచ్చిన వాళ్లలో కొందరు 'దురాశ దుఃఖం చేటు! ఈవిడ ఈ కంపెనీని కొనేసేలా ప్రవర్తించింది కదా!' అంటూ తమ అసూయను వెళ్లగక్కారు.

పిల్లలు పైకిరావాలని ఆవిడ చేసిన ప్రయత్నాలన్నీ నేలపై ఒలికిన పాలల్లా వ్యర్థం అయ్యాయి. పేదలకు కలలు కనే హక్కు లేదా? కలల్ని నిజం చేసుకొనే హక్కులేదా? గనిలోకి వెళ్లడానికి ఉద్యుక్తులవుతున్న పిల్లల్ని చూసినపుడల్లా ఆమెకు దుఃఖం పొంగుకొచ్చేది.

సైరన్ కూత వినిపించింది. వేటకుక్క అరుపు వినగానే దాక్కోడానికి స్థలం వెతుకుతూ పరుగెత్తే కుందేళ్లలా కార్మికులంతా తమతమ బొరియల్లోంచి బయటకు వచ్చి పెద్ద పెద్ద అంగలు వేస్తూ గనికేసి నడవసాగారు. గని పైభాగంలో ఉన్న కార్మికుడు విద్యుత్ గంట మోగించి, దిగువన (పిట్‌బాటం) ఉన్న కార్మికులకు పనిగంటలు ముగిశాయని తెలియజేశాడు. తమ పని గంటలు ముగిశాయని తెలుసుకొన్న కార్మికులు తాము బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నామని పైకి వర్తమానం పంపారు. 'సరే, ఇక మీరు ఇళ్లకు వెళ్లవచ్చు' అని కబురు వచ్చింది. చెదల పుట్టలోంచి బిలబిలమంటూ వచ్చే చెదల్లా కార్మికులు లిఫ్టు ద్వారా బయటికి వస్తున్నారు. బయటికి వచ్చినందుకు సాక్ష్యంగా వాళ్లు, గనిలోపల వెలుతురు కోసం తాము తీసుకెళ్లిన దీపాన్నీ, తల తొడుగునీ కాపలాదారుకు అప్పగించి సంతకం చేసి వెళ్తున్నారు.

తర్వాతి షిఫ్టులో పనిచేయడం కోసం వచ్చిన కార్మికులు, తాము వేసుకొచ్చిన బట్టలు తీసేసి, గనిలోపల పనిచేయడానికి అనువైన బట్టలు వేసుకొంటున్నారు. దీపాల గది లోకి వెళ్లి, తల తొడుగునీ, బ్యాటరీనీ తలమీదా, నడుంమీదా గట్టిగా కట్టుకొన్నారు. వాటిని తాము తీసుకొన్నందుకు దాఖలాగా సంతకం చేసి గని గుహ సంఖ్యను నమోదు చేశారు.

> **సరిగా పనిచేయలేదని నిర్ణయించే వాళ్ళూ, దండన విధించే వాళ్ళూ, పనిలోంచి తీసేసే వాళ్ళూ అంతా ఈ ఇద్దరే. గని యజమాని కానీ, ఉన్నతాధికారులు గానీ ఇవేవీ పట్టించుకోరు. వాళ్ళ ధ్యాసల్లా తమ విలాసమయ జీవితాన్ని ఏ విధంగా మరింత విలాసవంతం చేసుకోవాలి? ఎలా మరింత ధనం కూడబెట్టాలి అనే.**

ఒక్కో షిఫ్టులోనూ, కార్మికులు గనిలోకి వెళ్లే ముందు మైనింగు సర్దారూ, పంపు కళాసీ ఇద్దరూ ముందుగా అక్కడికి వెళ్లి పరిశీలిస్తారు. మైనింగు సర్దారు 'దండా' అని పిలువబడే బలమైన కర్రతో గని గోడల్ని తట్టి చూసి, గోడలూ, పైకప్పు బలంగా ఉన్నాయో లేదో నిర్ధారించి చెప్పాలి. (మీథేన్ గ్యాస్, కార్బన్ డైఆక్సైడ్ లీకేజి ఉందేమో సేఫ్టీ ల్యాంప్ ద్వారా పరిశీలించాలి. లీకేజీ వచ్చే చోట సేఫ్టీ ల్యాంప్ అతుక్కుపోతుంది. ఇలా పరిశీలించడంలో ఏమాత్రం అశ్రద్ధ వహించినా కార్మికులకు ప్రాణాపాయం కలగవచ్చు. నిప్పంటుకొనే ప్రమాదం కూడా ఉంది. గోడమీది చీలిక పెద్దగా ఉందా, నీళ్లు తోడిపోసే మర సరిగా పనిచేస్తోందా అని పరిశీలించడం పంపు కళాసీ బాధ్యత. ఈ పరిశీలన పూర్తయి, అంతా సవ్యంగా ఉంది, అని ప్రకటించిన తర్వాతే కార్మికులు గనిలోకి వెళ్లాలి.

'కేజ్‌రూం'లో కార్మికులు వరుసగా నిలబడ్డారు. బొగ్గు దిబ్బనూ చిన్నపాటి బాంబుతో పేల్చే డ్రిల్లరూ, బొగ్గు ముక్కల్ని ఒకటిగా పోగేసే కార్మికుడు, దాన్ని ఇనుపతొట్టెలో వేసి బండికి ఎక్కించే కార్మికుడూ ఈ ముగ్గురే కాయకష్టం చేసే కార్మికులు. పైనుంచి విద్యుత్ నిచ్చెన బావి లాంటి కంత ద్వారా పాతాళగనిలోకి దిగింది.

నిచ్చెన లోంచి దిగిన వెంటనే కార్మికులు తమ తలతొడుగుల్లోని దివ్వెల తాలూకు బ్యాటరీలను ఆన్ చేస్తారు. ఒకేసారి అందరూ దీపాలు వెలిగించడంతో, గుహలో కొద్దిగా కాంతి ప్రసరిస్తుంది. పదమూడు అడుగుల వెడల్పు, తొమ్మిది అడుగుల ఎత్తు ఉన్న దారంట బొగ్గు దిబ్బలకు అనువుగా ఉత్తర దక్షిణాలుగానో, తూర్పు పడమరగానో తొలుచుకొంటూ వెళ్లాలి. తర్వాత తొలిచే దారిని చిన్న చిన్న పాయలుగా చేసుకోవాలి. వాటిని స్తంభాలంటారు. ఒక స్తంభానికీ, మరో స్తంభానికీ మధ్య గోడ మందం 50 అడుగులు ఉంటుంది. పాయల్లో, బొగ్గు లభించేంత మేరా తవ్వుకొంటూ పోవాలి. దశల వారీగా పైనుంచి అడుగుభాగంకేసి తవ్వుకుంటూ పోవాలి.

లిఫ్టు తడవకు పదిమంది చొప్పున కార్మికులందర్నీ గనిలోకి చేరవేసింది. ఐదేసి కార్మికుల జట్లు కొన్ని, పదుగురి జట్లు కొన్ని తమకు కేటాయించిన గనుల్లోకి చేరుకొన్నాయి. చంచల్ కుమార్, అతని కుమారులు మనోజ్‌కుమార్, వరుణ్‌కుమార్, వీళ్లతోబాటు సుకుమార్ బావురి, కనాయ్ ప్రసాద్ హరిజన్ –ఈ ఐదుగురు సభ్యుల జట్టు బొగ్గును తవ్వి, ఇనుప తొట్టెలో నింపే పనిలో నిమగ్నమైంది.

కార్మికుల్నీ, బొగ్గు బండ్లనూ లెక్కబెట్టే మైనింగ్ గుమాస్తా దిలీప్ ఒక్కో గనిలోకి వెళ్ళి వస్తున్నాడు. ఒక్కో కార్మికుడూ ఒకటింపావు టన్ను బొగ్గును తవ్వి, తొట్టెలో నింపాలి. పొద్దున ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకూ కార్మికులు వెలికితేసే బొగ్గు దీనికి రెట్టింపు ఉంటుంది. అధికారులు 'ఒకటింపావు టన్నుకు తొట్టె' అని చెప్పే తొట్టె నిజానికి రెట్టింపు సామర్థ్యం కలది. అయితే కార్మికులకు ఈ విషయం తెలియదు. ఆ సామర్థ్యాన్ని లెక్కించే పద్ధతులు గానీ, స్వేచ్ఛగానీ వాళ్ళెరుగరు.

రెక్కలు ముక్కలు చేసుకొన్నా 'ఇంకా ఒకటింపావు టన్ను కాలేదు' అని తీవ్రశ్రుతిలో వినిపిస్తుందో కంఠం. అంతలోనే 'ఆ మిగతా రేపు పూర్తి చేసెయ్యాలి' అని కాస్త కరుణ ధ్వనించే కంఠం. అలా చెబుతున్న గుమస్తాను కార్మికులు తమను కష్టాల్లోంచి గట్టెక్కించే దైవంగా భావిస్తారు. గుమస్తా దయతలిస్తేనే తమ ఇళ్లలో పొయ్యి వెలుగుతుంది. సణుగుడు తగ్గుతుంది. ఆడవాళ్ల శీలానికి రక్షణ కలుగుతుంది.

మైనింగ్ సర్దారు, అతని కింద పనిచేసే గుమస్తా చెప్పింది వేదం. సరిగా పనిచేయలేదని నిర్ణయించే వాళ్ళూ, దండన విధించే వాళ్ళూ, పనిలోంచి తీసేసే వాళ్ళూ అంతా ఈ ఇద్దరే. గని యజమాని కానీ, ఉన్నతాధికారులు గానీ ఇవేవీ పట్టించుకోరు. వాళ్ళ ధ్యాసల్లా తమ విలాసమయ జీవితాన్ని ఏ విధంగా మరింత విలాసవంతం చేసుకోవాలి? ఎలా మరింత ధనం కూడబెట్టాలి అనే.

జీతాలిచ్చే రోజున ప్రతి కార్మికుడు ఒక్కరోజు కూలీని మైనింగ్ గుమస్తాకి సమర్పించుకోవాలి. ఇందులో ఉన్నతాధికారులకు వాటా ఉంది. ఒక రోజు కూలీ మూడు రూపాయలు. ఇలా ఒకరోజు కూలీని ఇచ్చివేయడం వల్ల వాళ్లకు అదనంగా ఏ సదుపాయము సమకూరదు. పనిలో ఏ మాత్రం పొరపాటు జరిగినా కఠిన శిక్షలకు గురికావలసిందే. వాళ్ల స్త్రీలను లైంగికంగా వేధింపులు, ఆకలి బాధ నుంచి తప్పించుకోవడం కోసం... భద్రత లేని ఈ ఉపాధి కాస్తా చేజారిపోతేందేమోనన్న భయంతోనూ కార్మికులు దీన్ని భరిస్తున్నారు. శ్రమ గురించీ అది ఉత్పత్తి చేసే అపారసంపత్తి గురించీ వాళ్లకు ఏ సూత్రమూ తెలియదు. వాళ్ళకు తెలిసిందల్లా కడుపుకు తగుపాటి తిండి, మనుషులుగా మనడానికి ముతక దుస్తులు, పందుల నెలవులాంటి చిన్న గుడిసె జీవితాంతం లభిస్తే చాలని. ఇందుకోసం వాళ్లు అవమానాన్ని, అనారోగ్యాన్ని, శ్రమదోపిడీని, కఠినాతి కఠిన శిక్షల్నీ భరించడానికి కూడా సిద్ధమే. బతుకు తీపితో అన్నిటినీ భరిస్తున్నారు!

గనులకే ప్రత్యేకమైన ఓ విధమైన కంపు. చిన్న శబ్దం కూడా భీకరారావంగా భయపెట్టే ప్రతిధ్వని. చంచల్‌కుమార్ పనిచేస్తోన్న గుహలో హఠాత్తుగా కప్పు కొద్దిగా విరిగిపడింది. ఓ పెద్ద బొగ్గు ముక్క అతన్ని తల వెనుక తగిలింది. అతడు కింద పడిపోయాడు. బొగ్గు మొన నుదిటికి తగిలి గాయమైంది. గాయం నుంచి స్రవించిన నెత్తురు బొగ్గు, ధూళీ, చెమటా కలగలసి శరీర మంతటా వెల్లువలా ప్రవహించింది. నొప్పి భరించలేక అతడు అరవసాగాడు.

(ఇంకావుంది)

స్ఫూర్తి



ఎస్. వీరయ్య
సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు
సి.పి.ఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

చెరగని ముద్ర

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో, ఆరోజుల్లో ఆరెస్సెస్ బలంగా ఉండేది. తననెదిరించే వారి మీద భౌతికదాడులకు పాల్పడేది. అనుక్షణం ఉద్రిక్త వాతావరణంతో పాటు, కమ్యూనిస్టు వ్యతిరేక సిద్ధాంతాలు బాగా ప్రచారంలో ఉండేవి. కార్మికులు, కూలీలు పని దొంగలనీ, సోమరులనీ, మద్యపానం వంటి వ్యసనాలతో దుబారా చేస్తారనీ, వీటివల్లనే పేదరికం పెరుగుతున్నదని చెప్పేవారు. కష్టపడేవారెప్పుడూ బాగుపడతారనేవారు. జనాభా కూడా ఒక మహమ్మారిలా తయారైందనీ, నిరుద్యోగ సమస్యకి అదే మూలమని వాదించేవారు. డిమాండు పెరగటం వల్లనే ధరలు పెరుగుతున్నాయని, డిమాండు సప్లై సిద్ధాంతం చెప్పేవారు. వీటన్నింటికీ నిత్యం సమాధానం చెప్పవల్సి వచ్చేది. వీరి వాదనలన్నీ తప్పు అనే బలమైన విశ్వాసాన్ని "మార్క్సిజం అంటే ఏటమి?" అన్న పుస్తకం కలుగజేసింది.

అది 1976వ సంవత్సరం చివర లేదా 1977వ సంవత్సరం ప్రారంభం. నేను మత ఛాందసవాదం నుండి వామపక్ష భావజాలం వైపు మొగ్గుతున్న సంధి సమయం. ఎమిలీబరన్స్ రాసిన 'మార్క్సిజం అంటే ఏమిటి?' అనే చిన్న బుక్‌లెట్ చదివాను. అది జీవిత గమ్యాన్ని శాశ్వతంగా మార్చి వేసింది. ఆర్.ఎస్.ఎస్. (రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) తో పూర్తిగా తెగదెంపులు చేసుకోవడానికి తోడ్పడింది. ఆ చిన్న పుస్తకమే మార్క్స్ రాసిన పెట్టుబడి గ్రంథాన్ని అధ్యయనం చేయాలనే తపన పెంచింది.

ఆరవ తరగతి నుండే ఆర్.ఎస్.ఎస్. శాఖకు వెళ్లే వాడిని. పెద్ద భక్తుడినికూడా. నవరాత్రి ఉత్సవాలతో సహా మా బజారులో నిర్వహించాల్సిందే. ఇతర పిల్లలందరినీ పోగేసి, నిధులు వసూలు చేసి, పూజలు నిర్వహించే కృషిలో నేనే ప్రధాన పాత్రధారిని. మా బజారులోని కుటుంబాలన్నీ ఈ పూజలకు తరలివచ్చేవి. చిన్న పిల్లల వ్యవహారమని ఎవరూ కొట్టిపారేసే వారు కాదు. ఈ సమయంలోనే 10వ తరగతి చదువుతుండగా. రహస్య జీవితం గడుపుతున్న ఒక కామ్రేడ్ (ప్రస్తుతం సి.పి.ఎం. రాష్ట్ర కమిటీ సభ్యుడు), విద్యార్థులకోసం రహస్యంగా నిర్వహించిన స్టడీసర్కిల్‌కు హాజరయ్యాను. అప్పటి నుండి ఆ విద్యార్థుల రూమ్‌కు రెగ్యులర్‌గా వెళ్ళేవాడిని. వామపక్ష భావజాలం వైపు ఆకర్షితుడనవుతూనే, ఆరెస్సెస్‌లో కూడా కొనసాగాను. ఇంటిర్మీడియట్‌లో సాయంశాఖ శిక్షక్‌గా పనిచేస్తూనే మార్క్సిస్టు సాహిత్యం కూడా చదువుతుండేవాడిని. సామాజిక సమస్యల పరిష్కారం గురించి, అక్కడా, ఇక్కడా కూడా చర్చ పెట్టేవాడిని. ఈ సమయంలోనే "మార్క్సిజం అంటే ఏమిటి?" అన్న చిన్న పుస్తకం చదివాను. అదే సమస్యకు తుది పరిష్కారం అందించింది. ఆ వెంటనే మార్క్స్ 'పెట్టుబడి' గ్రంథాన్ని, ఆరెస్సెస్‌కు ఆరాధ్య గ్రంథమైన 'పాంచజన్యం' కూడా అధ్యయనం చేయాలన్న పట్టుదలనూ పెంచింది. "పాంచజన్యం" చదవటం ఆరెస్సెస్ నిజరూపం అర్థం చేసుకోవడానికి తోడ్పడింది. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చేరీచేరటంతోనే ఆరెస్సెస్ మీద మొండిగా తిరగబడేటట్టు చేసింది. పెట్టుబడి గ్రంథం మాత్రం తెలుగులో అందుబాటులో లేదు. ఆల్జీబ్రాకు, ఆర్గానిక్ కెమిస్ట్రీకి కూడా భయపడలేదుగానీ, ఇంగ్లీష్ మాత్రం కొరకరాని కొయ్యగానే ఉండేది. అయినా ఆంగ్లంలో ఉన్న 'పెట్టుబడి' గ్రంథాన్ని కష్టపడి చదివాను. ఏమీ అర్థం కాలేదు. ఏమీ అర్థం కాకున్నా, ఆవులింతలు తీస్తూనే, రోజుల తరబడి ఎందుకు చదివానా అనిపిస్తుంది. అంత పట్టుదల పెంచింది మాత్రం ఎమిలీబరన్స్ రాసిన ఆ చిన్న పుస్తకమే! ఆ ఉత్సాహంతోనే 1978లో, నా క్లాస్‌మేట్స్ పదిమందిని కూర్చోబెట్టి అర్థశాస్త్రం బోధించే ప్రయత్నం చేశాను. మొహమాటంతో కూర్చున్నారేగానీ వారి కనురెప్పలు వాలిపోతున్నాయి. దోపిడీ సమాజం గురించి అర్థమయ్యే విధంగా బోధించాలంటే, ఉత్సాహం, పట్టుదల, సిద్ధాంతం పట్ల విశ్వాసం మాత్రమే చాలవనీ, లోతైన అధ్యయనం కూడా ఉండాలని అర్థమైంది. క్లాసు ఆపేస్తున్నానని చెప్పగానే ఆనందంగా ధన్యవాదాలు చెప్పారు. ఈ వైఫల్యం మాత్రం మరింత పట్టుదల పెంచింది.

పుస్తకం చిన్నదే. కానీ మార్క్సిజం గురించి రేఖా మాత్రంగానైనా సమగ్ర

దర్శనం చేస్తుంది. ప్రాథమిక దశలోనున్న వారికి కూడా అరటిపండు ఒలిచి నోట్లో పెట్టినట్టుగా, సులభంగా అర్థమయ్యే విధంగా ఉంటుంది. సామాజిక పరిణామ క్రమాన్ని, ప్రకృతి పట్ల మార్క్సిస్టు దృక్పథం, పరిణామ సూత్రాలను రేఖామాత్రంగా వివరిస్తుంది. కార్మికుల శ్రమదోపిడీ గురించి పెట్టుబడిదారీ వ్యవస్థ గురించీ, సామ్రాజ్యవాదం గురించి సోషలిజం, గురించి ప్రాథమిక అవగాహన నిస్తుంది. వర్గసమాజంలో వివిధ వర్గాల గురించి, వర్గ లక్షణాల గురించి వర్గ పోరాటం అనివార్యత గురించి సులభశైలిలో వివరణ ఉన్నది. రాజ్యాంగ యంత్రం గురించి, కార్మికవర్గ నియంతృత్వం గురించి కూడా వివరిస్తుంది. విప్లవ స్వభావం గురించీ, యుద్ధాల గురించి కూడా చర్చిస్తుంది. కార్మికవర్గ పార్టీ ఆవశ్యకత గురించీ, దీనిపాత్ర గురించి కూడా వివరిస్తుంది. పాలకవర్గాలకు వ్యతిరేకంగా సాగే పోరాటంలో, ఒంటరిపోరు విజయం సాధించజాలదని, మిత్రులను సమకూర్చుకోవాల్సిన అనివార్యతను చారిత్రకంగా రుజువుచేస్తుంది. ఆయాదేశ కాల పరిస్థితులకు అనుగుణంగా సిద్ధాంతాన్ని అన్వయించుకోవాల్సిన ఆవశ్యకత అనేక ఉదాహరణలతో వివరిస్తుంది. చరిత్రను పరిశీలించవల్సిన విధానాన్ని, ప్రజాఉద్యమాల వెనుక ఉండే వర్గ ప్రయోజనాలు, ప్రజల పాత్ర, వ్యక్తుల పాత్ర గురించి కూడా తడుముతుంది. మార్క్సిజం కార్యాచరణకు దారి ఎలా చూపుతుందో కూడా వివరిస్తుంది. కేవలం 72 పేజీలలో ఇన్ని విషయాలను సులభశైలిలో అందించిందీ పుస్తకం. అందుకేనేమో నా మదిలో మార్క్సిస్టు సిద్ధాంతం గురించి ఈ చిన్న పుస్తకం చెరగని ముద్రవేసింది. కొత్తగా వచ్చే కార్యకర్తలకు ఈ పుస్తకం తప్పకుండా చదవాలని చెబుతూ వుంటాను.

ఏమైనా అర్థశాస్త్రాన్ని మాత్రం వదలకూడదనుకున్నాను. ఉత్పత్తిలో శ్రమపాత్ర, విలువ, ధర అదనపు విలువ, లాభం, పెట్టుబడి, సంక్షోభం, నిరుద్యోగం వంటి అంశాలను అధ్యయనం చేయాలన్న కోరిక బలంగా ఉండేది. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో, ఆరోజుల్లో ఆరెస్సెస్ బలంగా ఉండేది. తననెదిరించే వారి మీద భౌతికదాడులకు పాల్పడేది. అనుక్షణం ఉద్రిక్త వాతావరణంతో పాటు, కమ్యూనిస్టు వ్యతిరేక సిద్ధాంతాలు బాగా ప్రచారంలో ఉండేవి. కార్మికులు, కూలీలు పని దొంగలనీ, సోమరులనీ, మద్యపానం వంటి వ్యసనాలతో దుబారా చేస్తారనీ, వీటివల్లనే పేదరికం పెరుగుతున్నదని చెప్పేవారు. కష్టపడేవారెప్పుడూ బాగుపడతారనేవారు. జనాభా కూడా ఒక మహమ్మారిలా తయారైందనీ, నిరుద్యోగ సమస్యకి అదే మూలమని వాదించేవారు. డిమాండు పెరగటం వల్లనే ధరలు పెరుగుతున్నాయని, డిమాండు సప్లై సిద్ధాంతం చెప్పేవారు. వీటన్నింటికీ నిత్యం సమాధానం చెప్పవల్సి వచ్చేది. వీరి వాదనలన్నీ తప్పు అనే బలమైన విశ్వాసాన్ని "మార్క్సిజం అంటే ఏమిటి?" అన్న పుస్తకం కలుగజేసింది. కానీ ఆ వాదనలను తిప్పికొట్టడానికి, అది మాత్రమే చాలలేదు. "పెట్టుబడి" గ్రంథం అర్థం కాలేదు. వామపక్షాల పుస్తకాలయాలన్నింటికీ క్రమం తప్పకుండా వెళ్ళేవాడిని. మార్క్సిస్టు అర్థశాస్త్రం గురించి తెలుగులో ఏ చిన్న పుస్తకం దొరికినా చదివేవాడిని. ఈ క్రమంలోనే పెట్టుబడి గ్రంథానికి రంగనాయకమ్మ పరిచయం ఐదు భాగాలుగా వచ్చింది. మొదటి భాగం చదివిన తర్వాత మిగతా భాగాల కోసం ఎదురు చూశాను. వెలువడినవెంటనే పుస్తకాలు తీసుకొని పూర్తయ్యే వరకూ చదివాను. మిక్కిలినేని అక్కయ్య తదితరులు అనువదించిన మొదటి భాగం కూడా చదివాను. రంగనాయకమ్మ పరిచయంలో చివర కొన్ని స్వంత అభిప్రాయాలు జోడించినప్పటికీ, స్థూలంగా "పెట్టుబడి" గ్రంథం అర్థం చేసుకోవడానికి బాగా తోడ్పడింది. తర్వాత ఇంగ్లీషు గ్రంథం కూడా గతం కన్నా మెరుగుగా అర్థం చేసుకునేందుకు ఉపయోగపడింది.

ప్రస్తుత పరిస్థితుల్లో అదనపు విలువ పంపిణీ, పునఃపంపిణీలో రాజ్యాంగ యంత్రం పాత్ర అర్థం చేసుకోవడానికి ఈ మాత్రం అర్థశాస్త్ర పరిజ్ఞానం అవసరమే. ప్రపంచీకరణ నేపథ్యంలో లాభాలేకాదు, సూపర్ లాభాలు (బహుశ ఇంకా అంతకుమించిన లాభాలు) అర్థం చేసుకోకుండా పెట్టుబడిదారీ దోపిడీ స్థాయిని అంచనా గట్టలేము. "అభివృద్ధి" అనే ముద్దుపేరుతో అమలు చేస్తున్న సరళీకృత ఆర్థిక విధానాల నిజరూపం అర్థం చేసుకోవడానికి, అర్థశాస్త్ర మూలసూత్రాల అధ్యయనం బాగా తోడ్పడింది. స్థూల జాతీయోత్పత్తి పెరుగుదలనూ, ప్రపంచ ధనికుల లిస్టులో చేరుతున్న భారతీయ పెట్టుబడిదారులను చూసి ప్రజలంతా పండగ చేసుకోవాలన్నట్లుగా చేస్తున్న ప్రచారాల బండారం అర్థం చేసుకోవడానికి కూడా ఉపయోగపడింది. ఈ రోజు ప్రపంచాన్ని ఆవహిస్తున్న సంక్షోభం గురించి కష్టపడైనా అర్థం చేసుకోవడానికి పునాది వేసింది మాత్రం ఆనాడు, ఆ చిన్న పుస్తకం ఇచ్చిన స్ఫూర్తే.

సిద్ధాంతం ప్రజలనావహిస్తే, అది విప్లవాన్నే సృష్టిస్తుందన్న మార్క్సిస్టు మహోపాధ్యాయుల మాట ఇక్కడ గుర్తుకు తెచ్చుకోవాలి. ఇంతటి ప్రాధ్యానత గల సిద్ధాంతాన్ని అధ్యయనం చేయటం, అర్థం చేసుకోవటం ఎంత ఆలస్యమైతే అంత నష్టమే కదా! సిద్ధాంతం, అర్థంకాని సిద్ధాంతంగా వదిలేయకూడదు. అర్థం చేసుకునేందుకు ప్రయత్నించ వల్సిందే. ★



ఈ సమయంలోనే "మార్క్సిజం అంటే ఏమిటి?" అన్న చిన్న పుస్తకం చదివాను. అదే సమస్యకు తుది పరిష్కారం అందించింది. ఆ వెంటనే మార్క్స్ 'పెట్టుబడి' గ్రంథాన్ని అరెస్సెస్‌కు ఆరాధ్య గ్రంథమైన 'పాంచజన్యం' కూడా అధ్యయనం చేయాలన్న పట్టుదలనూ పెంచింది. "పాంచజన్యం" చదవటం ఆరెస్సెస్ నిజరూపం అర్థం చేసుకోవడానికి తోడ్పడింది. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చేరీచేరటంతోనే ఆరెస్సెస్ మీద మొండిగా తిరగబడేటట్టు చేసింది. పెట్టుబడి గ్రంథం మాత్రం తెలుగులో అందుబాటులో లేదు. ఆల్జీబ్రాకు, ఆర్గానిక్ కెమిస్ట్రీకి కూడా భయపడలేదుగానీ, ఇంగ్లీష్ మాత్రం కొరకరాని కొయ్యగానే ఉండేది. అయినా ఆంగ్లంలో ఉన్న 'పెట్టుబడి' గ్రంథాన్ని కష్టపడి చదివాను. ఏమీ అర్థం కాలేదు. ఏమీ అర్థం కాకున్నా, ఆవులింతలు తీస్తూనే, రోజుల తరబడి ఎందుకు చదివానా అనిపిస్తుంది. అంత పట్టుదల పెంచింది మాత్రం ఎమిలీబరన్స్ రాసిన ఆ చిన్న పుస్తకమే!

ఆరోగ్యం

మూర్ఛవ్యాధి అవగాహన – జాగ్రత్తలు



డా॥ బి. వెంకట రమణ
న్యూరో ఫిజిషియన్
శ్రీనివాస న్యూరోకేర్
అనంతపురం

మూర్ఛవ్యాధి అంటే ఏంటి? అది రావడానికి కారణాలేంటి? వ్యాధిలో రకాలున్నాయా? వుంటే ఏంటి? వంటి వివరాలు గత సంచికలో తెలుసుకున్నాం. మరి...మూర్ఛవ్యాధిని ఎలా నిర్ధారిస్తారు? అందుకోసం ఎటువంటి వైద్యపరీక్షలు చేస్తారు? ప్రాథమిక చికిత్స, చికిత్స ఏంటి? ఈ వ్యాధి వున్న విద్యార్థులు, యువతీయువకులు (పెళ్లి విషయంలో) తీసుకోవలసిన జాగ్రత్తలేంటి? మూర్ఛవ్యాధికి సంబంధించి తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన పది సూత్రాలేంటి? వంటి వివరాలు ఈ వారం చెప్పుకుందాం.

మూర్ఛ రోగుల విషయంలో వ్యాధి నిర్ధారణను ఆయా రోగి యొక్క గత ప్రవర్తనా చరిత్రను పరిశీలించి చేయవలసి ఉంటుంది. మూర్ఛ వ్యాధి కొద్ది నిమిషాల పాటు వచ్చి పోయే జబ్బు కనుక, ఆ వ్యక్తికి మూర్ఛ వచ్చిన సమయాల్లో అతనికి దగ్గర ఉండి, ప్రత్యక్షసాక్షిగా ఆ రోగి యొక్క వ్యాధి లక్షణాలను అతని ప్రవర్తనలను, శారీరక పరిస్థితులను క్షుణ్ణంగా గమనించి, గుర్తుపెట్టుకున్న వ్యక్తుల ద్వారా వివరాలు సేకరించి వ్యాధి నిర్ధారణ చేయాలి. అప్పుడే సరైన చికిత్స చేయడానికి వీలవుతుంది.

నిర్ధారణ పరీక్షలు

1.ఇ.సి.జి 2. సి.టి.స్కానింగ్/ మెదడుపై ఎం.ఆర్.ఐ. పరీక్ష 3.వీడియో ఇ.సి.జి

ఇ.సి.జి పరీక్ష ద్వారా రోగి తలపైన ఎలక్ట్రోడ్స్ వుంచి, మెదడులోని విద్యుత్ సంకేతాలను రికార్డు చేస్తారు. అసాధారణ విద్యుత్ సంకేతాలు ఏమైనా మెదడులోని ఏ భాగంలో నుంచి అయినా విడుదల అవుతుంటే వాటిని గమనించి రోగ నిర్ధారణ చేయడం జరుగుతుంది.

మెదడు సిటి స్కాన్ /ఎంఆర్ఐ పరీక్షల ద్వారా మెదడులో ఏవైనా కణుతులు రక్తనాళాల్లో మార్పులు, క్షయ సంబంధమైన గడ్డలు, బద్దె పురుగులకు సంబంధించిన జబ్బులు ఉంటే వాటిని కనిపెట్టవచ్చు.

ప్రాథమిక చికిత్స

సాధారణంగా ఫిట్స్ 3 నుంచి 5 నిమిషాలకంటే ఎక్కువసేపు ఉండవు. అవసరమైన సమయాలలో ఈ కింది నియమాలు పాటించాలి

1.ఫిట్స్ వచ్చి కాళ్లు, చేతులు కొట్టుకొంటూ ఉంటే గట్టిగా పట్టుకో కూడదు. కాళ్లు చేతులు ఫిట్స్ వల్ల బాగా కదలుతున్నప్పుడు గట్టిగా పట్టుకొంటే ఎముక విరగవచ్చు. రోగిని కింద పడుకోబెట్టి అతనికి దెబ్బలు తగలకుండా చుట్టు పక్కల వస్తువులను దూరంగా ఉంచాలి.

2. నాలుకను కొరుక్కోకుండా ఒక గుడ్డను లేక మృదువైన వస్తువులను బాగా మడచి పళ్ల మధ్య పెట్టాలి. గాలి సక్రమంగా ఆడడానికి మెడను కాస్త వెనుకకు పట్టి ఉంచాలి. నోటిలోని నురుగు బయటకు కారిపోవడానికి రోగిని ఒక పక్కకు తిప్పి పడుకోపెట్టాలి.

3.బిగుతుగాఉన్న దస్తులు సడలించి, రోగిని అనవసరంగా కదపకుండా విరామంగా ఉంచాలి.

4.కళ్లజోడు, నోటిలోని నకిలీ దంతాలు ఉంటే వాటిని తీసివేయాలి.

5.ఫిట్స్ తగ్గాక రోగి నిద్రపోతే నిద్రపోనివ్వాలి. నిద్రలేపడానికి ప్రయత్నించరాదు.

6.రోగి చేతిలో తాళాలు పెట్టడం, అతనిపై నీళ్ల పోయడం వంటి మూఢనమ్మకాలతో కూడిన చర్యలు చేయరాదు.

7.రోగి చుట్టూ జనం గుమి కూడరాదు.

8.అతనికి పూర్తిగా స్పృహ వచ్చే దాకా తినడానికి, తాగడానికి ఏమీ ఇవ్వరాదు.

9.రోగికి దెబ్బలు తగిలినా, పదే పదే ఫిట్స్ వచ్చినా శ్వాస పీల్చడం కష్టంగా ఉన్నా 10 లేక

15 నిమిషాల పైన కూడా స్పృహ స్పష్టంగా రాకపోయినా, వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

చికిత్స

మూర్ఛ వ్యాధి ఏ రకానికి చెందినది? అన్న దాన్ని బట్టి దానికి చేసే చికిత్స ఆధారపడి ఉంటుంది. మొట్టమొదటిసారిగా ఫిట్స్‌కు గురి అయినప్పుడు ఆ వ్యక్తికి చికిత్స ఇవ్వాలా, కూడదా అన్నది ఆ రోగి పరిస్థితిని బట్టి, అతనికి ఆపాయం కల్గించే అంశాలను బట్టి, అతని మిగతా ఆరోగ్య పరిస్థితులను బట్టి ఎంతకాలంగా మూర్ఛవ్యాధి ఉన్నది అన్న విషయంపైన పరీక్షల రిపోర్టుపైన ఆధారపడి ఉంటుంది. ఒక్కసారి ఫిట్స్ వచ్చాక, చికిత్సా విధానాన్ని నిర్ధారించి, మందులు ఇవ్వకపోతే మరల మరల (ఫిట్స్) వచ్చేందుకు 10 నుంచి 61 శాతం అవకాశం వుంది. ఈనాడు మూర్ఛవ్యాధికి ఎన్నో మంచి మంచి మందులు వచ్చాయి. సరైన మందుల వాడకం వల్ల మూర్ఛ వ్యాధి ఏకారణం వల్ల వచ్చి ఉన్నా తగ్గిపోతుంది. అయితే ఈ వ్యాధికి మందులు చాలా కాలంగా వాడాలి. కొందరి విషయంలో జీవితాంతం కూడా వాడవలసి వుంటుంది. ఫిట్స్ కనపడడం లేదుకదా అని మందులు మధ్యలో మానివేస్తే వ్యాధి తిరిగి కనబడుతుంది.

మందులు వాడే పద్ధతి

రోగ నిర్ధారణ జరిగిన తర్వాత కనీసం రెండు, మూడు సంవత్సరాల కాలం ఒక్క రోజుకూడా విడవకుండా వాడుతూ వస్తే, మూర్ఛవ్యాధి 75 నుంచి 80 శాతం రోగులలో పూర్తిగా నయమవుతుంది. మిగతా 20 నుంచి 25 శాతం రోగులకు శస్త్ర చికిత్స ద్వారా నయం చేయవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

1.మూర్ఛ వ్యాధిగ్రస్తులను కించపరుచకుండా, మామూలు వ్యక్తులతో సమానంగానే ఆదరించాలి.

2.ఆధునిక వైద్యం వల్ల, చాలా మంది మూర్ఛ రోగులు అందరితో పాటు సాధారణ జీవితం గడపవచ్చు. ఉపవాసాలు, జాగారాల జోలికి వీళ్లను పోనివ్వకూడదు.

3. మత్తు పానీయాలు, మాదక ద్రవ్యాలను సేవించకుండా నిరోధించాలి.

4. డాక్టర్ సలహా మేరకు, నిర్ణీత గడువు వరకు ప్రతిదినం మాత్రలు వాడేలా చూడాలి.

5.ప్రయాణం చేసేటప్పుడు వాడే మందుల జాబితాను, తమ గుర్తింపు కార్డును తమతో ఉంచుకోవాలి. రాత్రులలో బస్సు ప్రయాణం చేయకూడదు.

6. వంట చేసేటపుడు జాగ్రత్తగా వుండాలి. ఎవరినయినా తోడు ఉంచితే మంచిది.

7.స్నానం చేసేటపుడు స్నానపుగది తలుపు లోపల గడియపెట్టకుండా కొంత మేరకు తెరిచి ఉంచడం మంచిది.

8.ప్రహరీ గోడలేని బావి దగ్గరకు వెళ్లకూడదు.



విద్యాభ్యాసము - ఉద్యోగ నిర్వహణ

1. మూర్ఛ వ్యాధి ఉన్న పిల్లలు అందరు పిల్లలలాగే స్కూళ్లల్లో కాలేజీల్లో విద్యాభ్యాసం చేయవచ్చు. కుటుంబంలోని ఇతర పిల్లలకు ఇచ్చిన ప్రాధాన్యతనే వీళ్లకూ లభించేలా జాగ్రత్త వహించాలి.

2.స్కూల్ అధికారులకు పిల్లల మూర్ఛవ్యాధిని గురించి తెలియచేయాలి. అందువల్ల అవసరమైన సమయాల్లో వాళ్లు జాగ్రత్తలు తీసుకోవడానికి వీలవుతుంది.

3.ఈ పిల్లలను ప్రత్యేకంగా చూసి, అతిగా రక్షించే పెంపకంలో పెంచరాదు. అలాగే వాళ్లను అతి శ్రమకు కూడా గురిచేయరాదు.

4. ఉద్యోగ విషయంలో వీళ్లు ఫిట్స్ వచ్చిన సమయంలో ప్రాణాపాయం సంభవించని నౌకరీలను మాత్రమే ఎన్నుకోవాలి. డ్రైవింగ్, పైలెటింగ్, ఈత, ఎత్తు ప్రదేశాలలో పనిచేయడం వంటి ఉద్యోగాలను వృత్తులను వీళ్లు చేపట్టరాదు.

వైవాహిక జీవితం

1.మూర్ఛవ్యాధిగ్రస్తులు సాధారణ వైవాహిక జీవితం గడపవచ్చు. ఈ వ్యాధి గురించి వివాహానికి ముందే కాబోయే భర్తకు / భార్యకు తప్పని సరిగా తెలపాలి.

2.మూర్ఛవ్యాధి ఉన్నవాళ్లు వివాహ జీవితపు బాధ్యతలు స్వీకరించే స్థోమత, ఆరోగ్యస్థితి ఉంటేనే వాళ్లకు పెళ్లి చేయాలి.

3.గర్భధారణకు ముందు డాక్టర్‌ను సంప్రదించి, అవసరమైతే మందులు మార్చవలసి వుంటుంది. తర్వాత గర్భిణీ స్త్రీలు తొమ్మిది నెలలు మందులు క్రమబద్ధంగా వాడవలసి వుంటుంది.

4.బాలింతలు పిల్లలకు పాలు ఇవ్వవచ్చు.

5.పెళ్లి చేస్తే మూర్ఛ రోగము కుదురుతుందన్న మూఢ విశ్వాసంతో వైవాహిక జీవితానికి అర్హత లేని మూర్ఛరోగులకు పెళ్లి చేయడం బాధ్యతారహితమైన చర్య అవుతుంది.

6.కంట్రోల్ కానటువంటి తీవ్రమైన మూర్ఛరోగం వుంటే ఆ వ్యక్తికి పెళ్లంటూ తలపెట్టకూడదు.

మూర్ఛ వ్యాధి -పది సూత్రములు

1.మూర్ఛవ్యాధిని చాలావరకు పూర్తిగా నయము చేయవచ్చు.

2.మూర్ఛవ్యాధి మెదడుకు సంబంధించిన జబ్బు. ఇది అంటురోగము, మానసిక వ్యాధి కాదు.

3.ఈ వ్యాధిగ్రస్తులకు మూర్ఛ మీకళ్లముందే రావడం తటస్థపడితే ఆ పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించండి. సరైన వివరాల ద్వారా రోగ నిర్ధారణ జరగకుండా సహాయం చేయలేరు. ఈ జబ్బుకు ప్రాథమిక చికిత్స అవసరము చాలా అరుదు.

4.తర్వితగతిలో చికిత్స ప్రారంభిస్తే ఒక్కటే ఈ జబ్బును అరికట్టడంలో విజయం సాధించవచ్చు.

5.డాక్టర్ సూచించిన మందులను సక్రమంగా ప్రతినిత్యం తీసుకోవాలి.

6. ఆఖరుసారిగా మూర్ఛ వచ్చినప్పటి నుంచి కనీసం 2 నుంచి 5 సంవత్సరాలపాటు ఈ మందులు వాడవలసి వుంటుంది.

7.ఈ వ్యాధిగ్రస్తులకు నిర్దిష్ట నిబంధనలు చాలా తక్కువ. క్రమబద్ధమైన నిద్ర మాత్రం అవసరం.

8.ఈ వ్యాధిగ్రస్తుల చదవవచ్చు, ఉద్యోగం చేయవచ్చు. జీవితం సంతోషముగా గడపవచ్చు.

9.ఈ వ్యాధిగ్రస్తులైన స్త్రీలు పెళ్లిచేసుకోవచ్చు. సంతానము పొందవచ్చు.

10.ఈ వ్యాధి గ్రస్తులను అతి రక్షిత వాతావరణంలో పెంచకండి. వారిని కించచపరచకండి. ఈ రోగ సమస్యలను, ఆస్మా(ఉబ్బసం), తలనొప్పి, మధుమేహం రోగాల సమస్యల లాగానే భావించండి.

★

కోడిపుంజు-4

బీర్బల్ కథలు



ఏది ఎక్కడ?



హాయ్ ఫ్రెండ్స్.... ఇక్కడ కొంతమంది పిల్లల తలలు ఉన్నాయి చూశారుగా. వాటి చుట్టూ కొన్ని జంతువులు కూడా ఉన్నాయి. వాటి పేర్లు కూడా చెప్తాము. మీరు చేయాల్సిందల్లా అవి ఎక్కడున్నాయో వెతకడమే. అవి ఏంటంటే... డైనోసార్, ఎలుక, కుక్కపిల్ల, సీతాకోకచిలుక,పక్షి. గుర్తించాక రంగులద్దండే!

సుడోకు చేద్దామా...

హాలో బుజ్జాయిలూ... కిందున్న పెద్ద బాక్సులో 9 చిన్న బాక్సులు ఉన్నాయి. మరలా ప్రతి బాక్సులో 9 గదులున్నాయి. వాటిలో ఒకటి నుండి తొమ్మిది వరకు అంకెలు వేయండి. అయితే ప్రతి వరుసలోనూ ఒక అంకెను ఒక సారి మాత్రమే వాడాలి. తర్వాత మా జవాబుతో సరి చూసుకోండి.

8			4		6			7
						4		
	1					6	5	
5		9		3		7	8	
				7				
	4	8		2		1		3
	5	2					9	
		1						
3			9		2			5

చెప్పుకోండి చూద్దాం

ఫ్రెండ్స్...ఈ బొమ్మని చూశారుగా. ఏంటి ఇది జంతువు లేక పక్షా అనుకుంటున్నారా. జంతువులు, పక్షుల అవయవాల కలయికతో ఏర్పడిన జీవి ఇది. ఆ జంతువులు, పక్షులు ఏవో మీరే చెప్పాలి. తెలీకపోతే జవాబు చూడండే.



జవాబులు

ఏది ఎక్కడ? : పైన ఎడమవైపు కుక్కపిల్ల, కుడివైపు సీతాకోక చిలుక, మధ్యలో పక్షి. కిందివైపు డైనోసార్, దాని తోక దగ్గర ఎలుక.

చెప్పుకోండి చూద్దాం : పిట్ట దేహం, గొర్రె పొటేలు కొమ్ములు, తొండ తల, పాము తోక.

సుడోకు చేసారా? :

8	3	5	4	1	6	9	2	7
2	9	6	8	5	7	4	3	1
4	1	7	2	9	3	6	5	8
5	6	9	1	3	4	7	8	2
1	2	3	6	7	8	5	4	9
7	4	8	5	2	9	1	6	3
6	5	2	7	8	1	3	9	4
9	8	1	3	4	5	2	7	6
3	7	4	9	6	2	8	1	5

బాలనేస్తాలు

కనిపెట్టాలోచ్!

పిల్లలూ... ఇక్కడ చాలా అక్షరాలు ఉన్నాయి. వాటిలో కింద ఇచ్చిన పదాలు దాగున్నాయి. అవి ఈ బాక్సులో అడ్డంగా, నిలువుగా ఎలాగైనా ఉండొచ్చు. వాటిని కనిపెట్టి సున్నా చుట్టండే.

d	o	d	o	u	b	l	o	o	n	s	z
x	b	d	p	w	t	l	j	e	p	t	q
x	c	l	k	l	e	d	a	r	a	p	f
z	d	l	o	g	m	c	w	i	e	e	w
a	y	l	k	c	i	e	u	s	l	k	y
q	y	r	a	s	a	g	f	t	p	a	d
e	q	a	u	v	n	s	p	a	r	c	m
n	j	m	d	i	i	c	o	h	u	g	a
e	i	o	c	s	h	n	s	f	p	n	s
r	s	n	g	j	e	s	r	z	j	i	k
z	a	m	l	c	n	u	c	a	h	k	s
d	g	r	e	e	n	c	t	a	c	i	x

carnival dancing doubloons gold

green hats king cake masks

music parade purple tuesday

గుర్రంబొమ్మ గీసేద్దాం



డి. తేజస్వి,
3వ తరగతి,
ఓగోడు.



చిన్నారి, 3వ తరగతి,
పొన్నూరు.

చిన్నారి చిత్రకారులు

అట్టమీది కథ



పొలిటికల్ అంపైర్!

- వి. రాజగోపాల్

'మేము ప్రపంచంలోనే అతిపెద్ద పొలిటికల్ మ్యాచ్‌లకు అంపైర్లం. ఇప్పుడు జరగాల్సిఉన్న మ్యాచ్‌ను సమర్ధవంతంగా, ప్రశాంతంగా నిర్వహించడం ఎలా అన్నదానిపైనే మా దృష్టి. అత్యంత కీలకమైన ఈ సమయంలో ఇతర మ్యాచ్‌ల గురించి ఆలోచించలేం' ఇవి భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎన్. గోపాలస్వామి చెప్పిన మాటలు. దేశవ్యాప్తంగా జరగనున్న సాధారణ ఎన్నికల నేపధ్యంలో క్రికెట్ మహాసంగ్రామంగా పేరొందిన ఐపిఎల్ 20-20 మ్యాచ్‌లపై నెలకొన్న సందిగ్ధత గురించి పాత్రికేయులు ప్రశ్నించినప్పుడు ఆయన ఇచ్చిన సమాధానమిది! భారత ఎన్నికల కమిషన్‌కు ఉన్న ప్రత్యేకతే అది.

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో సార్వజనీన ఎన్నికలు నిర్వహించడాన్ని 'కత్తిమీదసాము' లాంటి చిన్నచిన్న మాటలతో అభివర్ణించలేం. ఎన్నికల నిర్వహణలో ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రపంచదేశాల్లో అపహాస్యం పాలుకాక తప్పదు. 'వీళ్లకి పాలించుకోవడం ఏమి తెలుసు... మనం వెళ్లిపొతే కుక్కలు చింపిన విస్తరే... మళ్ళీ మన కాళ్లవద్దకే వస్తారు' అన్న పరాయిపాలకుల అంచనాల మధ్య స్వాతంత్రం పొందిన దేశం మనది. దేశ విభజన సందర్భంగా చోటుచేసుకున్న దురదృష్టకర సంఘటనలకే 'ఆ దేశం పని అంతే' అంటూ ఊహాగానాలు చేసిన కొందరు పాశ్చాత్యదేశాల పరిశీలకుల మెదళ్లు దిమ్మెతిరిగేటట్టు పటిష్టమైన ప్రజాస్వామ్యాన్ని సుస్థిరం చేసుకున్న జాతి మనది. అందుకే భారత దేశంలో జరిగే ఎన్నికలంటే ప్రపంచవ్యాప్తంగా మీడియాకు అమితాసక్తి! ఎన్నికల ప్రక్రియను కవర్ చేయడానికి, ఫలితాలను ఎప్పటికప్పుడు తెలియచేయడానికి వివిధ దేశాల్లో మీడియా సంస్థలు అత్యంత ప్రాధాన్యత ఇస్తాయి. అమెరికా అధ్యక్ష పదవికి జరిగే ఎన్నికల తరువాత ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ఆకర్షించేవి భారతదేశ ఎన్నికలే!

2009 జనాభా అంచనాల ప్రకారం భారతదేశ జనాభా 116 కోట్లకు చేరింది. వీరిలో 714 మిలియన్లమంది తాజా ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. 2004 ఎన్నికలతో పోలిస్తే ఓటర్ల సంఖ్య 43 మిలియన్లు పెరిగింది. నామినేషన్ల ప్రక్రియకు చివరిరోజు వరకూ ఓటు హక్కు కల్పించనుండటంతో ఈ సంఖ్య మరో మిలియన్‌దాకా పెరుగుతుందని అంచనా. అంటే వాస్తవ పోలింగ్ ప్రక్రియ జరిగేనాటికి 715 మిలియన్ల మంది దేశవ్యాప్తంగా ఓటర్లుగా నమోదుకానున్నారు. ఈ 715 మిలియన్ల మందిలో ప్రతి ఒక్కరికి ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం ఇవ్వాలన్నది ఎన్నికల కమిషన్ లక్ష్యం. 'ఓటు వేయాలా? లేదా?' అన్నది ఓటరిష్టం. కాని సౌకర్యాలు లేని కారణంగా ఏ ఒక్కరు కూడా ఓటుహక్కుకు దూరంగా ఉండకూడదు' అని ఇటీవల ప్రధాన ఎన్నికల కమిషనర్ గోపాలస్వామి వ్యాఖ్యానించారు. ఇది నిజంగా ఒక సవాలే ...! ఆ సవాల్‌ను స్వీకరించింది భారత ఎన్నికల కమిషన్. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంతవరకూ ఎన్నికల

కమిషనే సర్వాధికారి. ఛోటా... మోటా నాయకుల నుండి ... ప్రధానమంత్రి వరకూ ప్రతి ఒక్కరిపై ఎన్నికల కమిషన్ డేగకన్ను పెడుతుంది. తప్పులు చేస్తే చురకలేస్తుంది. అవసరమైతే చర్యలు తీసుకుంటుంది. ఒక మతాన్ని దృష్టిలో ఉంచుకుని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన వరుణ్‌గాంధీ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని కమిషన్ భారతీయజనతాపార్టీకి సూచించడం దీనికో నిదర్శనం. రాష్ట్రంలో అయితే పాలకపార్టీని కీర్తిస్తూ మాట్లాడిన డిజిపిపై ఏకంగా బదిలీవేటు వేసింది. ఎన్నికల కమిషన్‌కు ఈ అధికారాలు ఎలా వచ్చాయి. అసలు ఎన్నికల కమిషన్ ఎప్పుడు ఏర్పాటైంది?

ఎన్నికల కమిషన్‌కు, ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవికి గుర్తింపు తీసుకొచ్చింది టిఎన్ శేషన్. 1990 డిసెంబర్ నుండి 1996 డిసెంబర్ వరకు సిఇసిగా బాధ్యతలు నిర్వహించిన శేషన్ మాట అంటే అప్పట్లో సుగ్రీవాజ్ఞే! ఆయన గీచిన గీతను దాటడానికి బడా నేతలు సైతం వెనుకంజవేశారు. నియంతృత్వంగా వ్యవహరించారన్న విమర్శలను కూడా మూటగట్టుకున్న శేషన్ చేసిన పని వాస్తవానికి అప్పటివరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి పట్టిఉన్న బూజును దులపడమే. ఆయన ధాటికి తాళలేక ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు అదనంగా మరో ఇద్దరు కమిషనర్లను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 1993 అక్టోబర్ ఒకటిన కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మెజార్టీ నిర్ణయం ప్రకారం కమిషన్ నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించింది. అప్పటినుండి ముగ్గురు సభ్యులతో నడుస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం 1950 జనవరి 25న శాశ్వత రాజ్యాంగవ్యవస్థగా ఆవిర్భవించింది. అప్పటి నుండి దేశవ్యాప్తంగా జరుగుతున్న వివిధ ఎన్నికలకు బాధ్యత వహిస్తోంది. 2001లో ఎన్నికల కమిషన్ గోల్డెన్‌జూబ్లీ ఉత్సవాలను కూడా జరుపుకుంది.

కమిషన్ నియామకం ఇలా ...!

ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో పాటు ఇద్దరు కమిషనర్లను కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు రాష్ట్రపతి నియమిస్తారు. వీరి గరిష్ట పదవీకాలం ఆరు సంవత్సరాలు. 65 సంవత్సరాల వయోపరిమితికి చేరినా పదవీ విరమణ చేయాల్సి ఉంటుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తితో సమానంగా జీతభత్యాలు పొందుతారు. వీరి తొలగింపు ప్రక్రియ అంత సులభమేమి కాదు. పార్లమెంటు ఉభయసభల సమావేశాల్లో మహాఅభియోగ తీర్మానం ప్రతిపాదన ద్వారానే వీరిని తొలగించడం సాధ్యమవుతుంది. అంటే 2/3 మెజార్టీతో మహాభియోగతీర్మానం ఆమోదం పొందాల్సివస్తుంది. ప్రస్తుత సంకీర్ణ ప్రభుత్వాల యుగంలో అంత మెజార్టీ సాధించాలంటే అంత సులభమేమి కాదన్నసంగతి తెలిసిందే. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఎన్నికల సంఘానికి ప్రత్యేకంగా సెక్రటేరియట్ ఉంది. కమిషన్ రోజువారి కార్యక్రమాలన్నీ అక్కడి నుండే జరుగుతాయి. 300మందికి పైగా అధికారులు ఈ సెక్రటేరియట్‌లో విధులు నిర్వహిస్తారు. కమిషన్ విధి నిర్వహణలో ఇద్దరు, ముగ్గురు డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లుకూడా పాలుపంచుకుంటారు. వీరిని సాధారణంగా జాతీయ సర్వీసెస్ అధికారుల నుండి తీసుకుంటారు. సూక్ష్మస్థాయిలో పరిశీలన తరువాతే వీరి నియామకానికి గ్రీన్‌సిగ్నల్ లభిస్తుంది. వివాదరహితంగా, నిష్పక్షపాతంగా, నిజాయితీగా వ్యవహరించడం ఎన్నికల కమిషన్‌లో నియామకానికి తొలి గీటురాళ్లు. వీరుగాక డైరెక్టర్లు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, సెక్రటరీలు, అండర్‌సెక్రటరీలు, డిప్యూటీ డైరక్టర్లు ఇలా కమిషన్ విధినిర్వహణలో భాగస్వాములయ్యే ఉద్యోగులు ఎందరో ఉంటారు. ఇక ఎన్నికల సమయంలో అన్ని ప్రభుత్వశాఖలకు చెందిన సిబ్బంది మొత్తం ఎన్నికల కమిషన్ పరిధిలోకే వస్తారు. రాష్ట్ర స్థాయిలో సీనియర్ ఐఎఎస్ అధికారిని ఎన్నికల కమిషన్ ప్రధాన ఎన్నికల అధికారిగా నియమిస్తుంది. జిల్లాల స్థాయిలో కలెక్టర్లు ఎన్నికల సమయంలో జిల్లా ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారు. ఎన్నికల కమిషన్ విధి నిర్వహణకైన బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వ ఆర్థికశాఖ కేటాయిస్తుంది. సాధారణంగా ఎన్నికల కమిషన్ కోరిన మేరకు నిధులను విడుదల



చేస్తారు.

ఎన్నికల నిర్వహణ ఇలా ...

రాజ్యాంగ నిబంధనలు, పార్లమెంటు చట్టాల ప్రాతిపదికగా కమిషన్ ఎన్నికలను నిర్వహిస్తుంది. ఓటర్ల జాబితా రూపకల్పనకు సంబంధించి 1950వ సంవత్సరం నాటి ప్రజా ప్రాతినిధ్యచట్టం కమిషన్‌కు విధివిధానాలను నిర్దేశిస్తుంది. ఎన్నికల నిర్వహణ, ఎన్నికల అనంతర వివాదాలను పరిష్కరించడానికి 1951 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని ఇసి ప్రాతిపదికగా తీసుకుంటుంది. చట్టాలు మౌనం వహించిన చోట సుప్రీంకోర్టు మార్గదర్శకాలు రూపొందిస్తుంది. ఎన్నికల కమిషన్ కూడా తన విచక్షణాధికారాలను వినియోగించి నిర్ణయాలు తీసుకుంటుంది. కమిషన్ తీసుకునే నిర్ణయాలను న్యాయస్థానాల్లో సవాల్ చేయవచ్చు. సాధారణంగా ప్రతి ఐదు సంవత్సరాలకు ఎన్నికలు జరిగే విషయం తెలిసిందే! ఐదు సంవత్సరాల కాలవ్యవధి పూర్తికాగానే కమిషన్ ఎన్నికల ప్రక్రియపై దృష్టి సారించింది. రాజ్యాంగ నిబంధన ప్రకారం చివరి లోక్‌సభ సమావేశాలు ముగిసిన ఆరునెలల్లోగా కొత్త లోక్‌సభ ఏర్పడి తీరాలి. ఈలోగానే ఎన్నికల కమిషన్ కొత్త లోక్‌సభ ఏర్పడటానికి అవసరమైన ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలి.

మంచుకొండల నుండి ... మండుటెడారి వరకు ...!

ఎన్నికల షెడ్యూల్ రూపొందించడం నిజంగా పెద్ద కసరత్తే! మంచుకొండలతో నిండిఉండే జమ్ముకాశ్మీర్ నుండి ఇసుకతుఫాన్‌లతో సతమతమయ్యే రాజస్థాన్ ఎడారుల వరకు వాతావరణ పరిస్థితులను పరిశీలించాలి. సాధారణ ప్రకృతి వైపరీత్యాలు చోటుచేసుకోని సమయంలో ఎన్నికలను నిర్వహించే బాధ్యత కమిషన్‌దే! దేశవ్యాప్తంగా వ్యవసాయ సీజన్‌ను కూడా పరిగణలోకి తీసుకోవాలి. పంటపనుల కారణంగా రైతాంగం ఓటింగ్‌కు దూరంగా మిగలకుండా చూసేందుకు ఈ జాగ్రత్త తీసుకుంటారు. పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులను ఎన్నికల విధులకు వినియోగిస్తున్నందున పరీక్షల సమయంలో ఎన్నికలు నిర్వహించకుండా చూడటం తప్పనిసరి. ఇక వివిధ మతాలకు చెందిన పండుగలు, ఉత్సవాలు కూడా పోలింగ్‌రోజు రాకుండా చూసుకోవాలి. దేశవ్యాప్తంగా ఉన్న 543 లోక్‌సభ స్థానాల్లో స్థానిక పరిస్థితులను పూర్తిస్థాయిలో సమీక్షించిన తరువాతే ఇసి ఎన్నికల షెడ్యూల్‌ను ఖరారు చేస్తుంది. దీనికోసం భారీ కసరత్తే చేస్తుంది. దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులు ఈ కసరత్తులో భాగస్వాములవుతారు. పోలింగ్ ప్రక్రియకు కొన్ని వారాల ముందు సాధారణంగా కమిషన్ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తుంది. షెడ్యూల్ ప్రకటించిన





వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి దేశవ్యాప్తంగా అమలులోకి వస్తుంది. !

ప్రపంచంలోనే అతి పెద్ద ...!

భారత ఎన్నికల నిర్వహణ ప్రపంచంలోనే అతిపెద్ద మేనేజ్‌మెంట్ ఈవెంట్‌గా గుర్తింపు పొందింది. 543 లోక్‌సభాస్థానాల పరిధిలో 8లక్షలకు పైగా పోలింగ్ స్టేషన్లలో 715మిలియన్ల మందికి ఓటుహక్కు వినియోగించుకునేలా సౌకర్యాలు ఏర్పాటు చేయడమంటే మాటలా మరి! 2004వ సంవత్సరంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 67,14,87,930 మంది ఓటర్లకుగాను 38,99,48,330 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఆరు జాతీయపార్టీల నుండి 1351మంది, 36 ప్రాంతీయపార్టీల నుండి 801మంది, అధికారికంగా గుర్తింపుపొందిన మరో 50 పార్టీల నుండి 898మంది ఆ ఏడాది ఎన్నికల బరిలో దిగారు. వీరుగాక మరో 2385మంది ఇండిపెండెంట్ అభ్యర్థులు పోటీ చేశారు. వీరందరికి గుర్తులు కేటాయించడం, దానికి తగ్గట్టుగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను రూపొందించడం ఇదంతా కూడా ఇసి చేయాల్సిన పనుల్లో భాగమే! 2009లో జరుగుతున్న తాజా ఎన్నికలను ఐదు దశల్లో నిర్వహించడానికి కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. దీనికోసం దేశవ్యాప్తంగా 8,28,804 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనుంది. 2004వ సంవత్సరంలో 6,87,402 పోలింగ్ స్టేషన్లను మాత్రమే ఏర్పాటు చేశారు. అప్పటితో పోలిస్తే తాజా ఎన్నికల్లో 1,41,402 పోలింగ్ స్టేషన్లను అదనంగా ఏర్పాటు చేశారు. 300 మందికన్నా తక్కువ ఓటర్లున్న ప్రాంతాల్లో 12,901 పోలింగ్‌స్టేషన్లను కొత్తగా ఏర్పాటు చేయడం తాజా ఎన్నికల ప్రత్యేకత. ఇతర ప్రాంతాలకు వెళ్లి ఓటు వెయ్యడానికి స్థానికులు భయం వ్యక్తం చేయడంతో ఇసి ఈ నిర్ణయం తీసుకుంది.

ఏ రాష్ట్రంలో ఎప్పుడెప్పుడు! **పోలింగ్‌తేదీలు**

రాష్ట్రం	నియోజక వర్గాలు	దశలు	16.4.09 ఫేజ్1	23.4.09 ఫేజ్2	30.4.09 ఫేజ్3	7.5.09 ఫేజ్4	13.5.09 ఫేజ్5
ఆంధ్రప్రదేశ్	42	2	22	20			
అరుణాచల్‌ప్రదేశ్	2	1	2				
అస్సాం	14	2	3	11			
బీహార్	40	4	13	13	11	3	
గోవా	2	1		2			
హర్యానా	10	1				10	
హిమాచల్‌ప్రదేశ్	4	1					4
జమ్ముకాశ్మీర్	6	5	1	1	1	1	2
కర్నాటక	28	2		17	11		
కేరళ	20	1		20			
మధ్యప్రదేశ్	29	2		13	16		
మహారాష్ట్ర	48	3	13	25	10		
మణిపూర్	2	2	1	1			
మేఘాలయ	2	1	2				
మిజోరం	1	1	1				
నాగాలాండ్	1	1	1				
ఒరిస్సా	21	2	10	11			
పంజాబ్	13	2				4	9
రాజస్థాన్	25	1				25	
సిక్కిం	1	1			1		
తమిళనాడు	39	1					39
త్రిపుర	2	1		2			
ఉత్తరప్రదేశ్	80	5	16	17	15	18	14
పశ్చిమబెంగాల్	42	3			14	17	11
ఛత్తీస్‌ఘడ్	11	1	11				
జార్ఖండ్	14	2	6	8			
అండమాన్	1	1	1				
చండీఘర్	1	1					1
దాద్రా, నాగర్‌హవేలి	1	1				1	
డామన్‌డయ్యూ	1	1			1		
ఢిల్లీఎన్‌సిటి	7	1				7	
లక్షద్వీప్	1	1	1				
పాండిచ్చేరి	1	1					

ఎంతమంది అభ్యర్థులు ...?

ఎన్నికల బరిలో దిగుతున్న వారి సంఖ్య అనూహ్యంగా పెరుగుతోంది. మొట్టమొదటి సాధారణ ఎన్నికలు జరిగిన 1952లో సగటున ప్రతి నియోజకవర్గంలో 3.8మంది అభ్యర్థులు బరిలోకి దిగారు. 1991వ సంవత్సరానికి బరిలో దిగేవారి సగటు 16.3కు పెరిగింది. 1996లో వీరిసంఖ్య 25.6కు చేరింది. నాన్‌సీరియస్ అభ్యర్థులు కూడా పెద్దసంఖ్యలో బరిలోకి దిగుతుండటంతో ఆ సంవత్సరమే ఎన్నికల కమిషన్ ఈ విషయమై దృష్టి సారించింది. డిపాజిట్ మొత్తాన్ని పెంచడంతో పాటు, అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించేవారి సంఖ్య పెంచాలని ఇసి నిర్ణయించింది. ఈ నిర్ణయం కొద్దిమేరకు ఫలితాలనిచ్చింది. అయితే, ఇటీవల కాలంలో మళ్లీ ఎన్నికల బరిలో దిగుతున్న వారి సంఖ్య క్రమేణా పెరుగుతోంది. 1998వ సంవత్సరంలో ఒక్కో లోక్‌సభ నియోజకవర్గానికి సగటున 8.74 మంది అభ్యర్థులు బరిలోకి దిగగా, 2004 సంవత్సరంలో ఆ సంఖ్య 10కి చేరింది. తాజా ఎన్నికల్లో సగటున 12 మంది అభ్యర్థులు పోటీపడే అవకాశం ఉందని అంచనా.

డిపాజిట్ అంటే ...

ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయారు అంటుంటారు కదా! డిపాజిట్ కోల్పోవడమంటే ఎన్నికల్లో పోటీచేయడానికి ధరావత్తుగా కట్టిన మొత్తాన్ని తిరిగి వెనక్కి తీసుకోవడానికి వీలుకాని తక్కువ ఓట్లను పొందడం. సాధారణ ఎన్నికల్లో పోటీచేయడానికి ఒక్కో అభ్యర్థి 10వేల రూపాయల మొత్తాన్ని డిపాజిట్‌గా చెల్లించాల్సిఉంటుంది. ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు ఈ మొత్తంలో సగమే డిపాజిట్ మొత్తంగా ఉంటుంది. మొత్తం చెల్లిన ఓట్లలో 1/6వ వంతుకన్నా ఎక్కువ ఓట్లు పొందిన అభ్యర్థికి డిపాజిట్ మొత్తాన్ని ఇసి తిరిగి చెల్లిస్తుంది.

డిపాజిట్లు కోల్పోయారంటే ఆ ఆరవవంతు ఓట్లు కూడా రాలేదని అర్థం.

ప్రచారపర్వంపై అంక్షలు ...

అభ్యర్థులు పెద్దఎత్తున చేసే ప్రచారంపై కూడా ఇసి కొరడా ఝుళిపించింది. ప్రజల వ్యక్తిగత జీవితాలకు, ప్రాథమిక హక్కులకు ఆటంకం కలగకుండా ప్రచారం నిర్వహించాలని ఇసి ఆదేశించింది. దీనిలో భాగంగా పబ్లిక్‌స్థలాల్లో గోడలపై రాతలు, పోస్టర్లు అంటించడాన్ని నిషేధించింది. ఇళ్లగోడలపై రాయాలన్నా ఆ ఇంటి యజమాని అనుమతి తప్పనిసరి. ఈ మేరకు రాతపూర్వకంగా అనుమతి తీసుకోవాలి. మైకులతో ప్రచారం చేయడంపైనా అంక్షలు పెట్టింది. రాత్రి పదిగంటలు దాటిన తరువాత ఎటువంటి పరిస్థితుల్లోనూ మైక్ కట్టేయాల్సిందే. ఇక సైద్ధాంతిక అంశాలతో నిమిత్తం లేని వ్యక్తిగత దూషణలు, మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రసంగించడం పూర్తిగా నిషేధం. ఈగీటు దాటిన అభ్యర్థులపై ఇసి కఠినచర్యలు తీసుకుంటుంది. క్రిమినల్ కేసులు నమోదు చేస్తుంది. ప్రచార వ్యయంపై కూడా అంక్షలు పెట్టింది. ప్రచారవ్యయంపై పెట్టిన అంక్షలు కాగితాలకే పరిమితమవుతోందంటూ ఎన్నికల కమిషనే స్వయంగా ఆవేదన వ్యక్తం చేస్తోంది. పార్లమెంటు ఈ విషయంలో చట్టం చేయాలంటూ దాదాపు దశాబ్దం క్రితం ఇసి చేసిన విజ్ఞప్తి ఇంతవరకూ ఆచరణలోకి రాలేదు.

ఒకే ఒక్కడు ...!

గుజరాత్‌లోని ఓ పోలింగ్ స్టేషన్‌లో ఈ సారి ఒకే ఒక్క ఓటరు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ప్రధాన జనావాసానికి సుదూర తీరంలో ఉండే ఆయనకోసం ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా పోలింగ్‌స్టేషన్ ఏర్పాటు చేయనుంది. ఆ రాష్ట్రంలోని జునాఘడ్ జిల్లాలో ఆసియన్ సింహాల సంరక్షణా కేంద్రం ఉన్న గిర్ అడవుల్లో ఈ పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకానుంది. జమ్ముకాశ్మీర్‌లోని కటువా అసెంబ్లీ నియోజకవర్గం జిల్లా పారిశ్రామిక కేంద్రంలో ఇద్దరు ఓటర్లకోసం పోలింగ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఛత్తీస్‌ఘర్ రాష్ట్రంలో మరో రెండు పోలింగ్‌స్టేషన్లను కూడా ఇద్దరు ఓటర్లకోసం ఏర్పాటుచేస్తున్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లో ముగ్గురు ఓటర్లు మాత్రమే ఉన్న మూడు వేరు వేరు ప్రాంతాల్లో కూడా ప్రత్యేకంగా పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటుకానున్నాయి. భారత మీడియాలో వీటికి పెద్ద ప్రాధాన్యత లభించలేదు కాని, మన పొరుగునే ఉన్న పాకిస్థాన్‌లో ఈ పోలింగ్‌స్టేషన్ల ఏర్పాటు పెద్ద చర్చనీయాంశమైంది. అక్కడి కొన్ని పత్రికలు 'భారత్‌లోనే సాధ్యం' అంటూ పతాకశీర్షికల్లో ప్రచురించాయి. ప్రజాస్వామ్యానికి భారత ప్రజలు ఇచ్చే ప్రాధాన్యతకు నిదర్శనంగా ఆ పత్రికలు వీటి ఏర్పాటును అభివర్ణించాయి.



ప్రధాన ఎన్నికల కమిషనర్లు వీరే ...!

1950లో ఎన్నికల కమిషన్ ఏర్పాటయినప్పటినుండి ఇప్పటివరకు 15 మంది ప్రధాన ఎన్నికల కమిషనర్లుగా బాధ్యతలు నిర్వహించారు. సుకుమార్‌సేన్ (21.3.50 నుండి 19.12.58), కెవిఎన్ సుందరమ్ (20.12.58 నుండి 30.9.67), ఎస్‌పి సెన్‌వర్మ (1.10.68 నుండి30.9.72), డాక్టర్ నాగేందర్‌సింగ్ (1.10.72 నుండి 6.2.73), టి.స్వామినాథన్ (7.2.73 నుండి 17.6.77), ఎస్ఎల్‌శక్‌ధర్ (18.6.77 నుండి 17.6.82), ఆర్.కె త్రివేది (18.6.82 నుండి 31.12.85), ఆర్‌విఎస్ పేరి శాస్త్రి (1.1.86నుండి 25.11.90), వి.ఎస్ రమాదేవి (26.11.90 నుండి 11.12.90) టిఎన్ శేషన్ (12.12.90 నుండి 11.12.96), ఎంఎస్ గిల్ (12.12.96 నుండి 13.6.2001) జె.ఎం. లింగ్డో (14.6.2001 నుండి 7.2.2004), టిఎస్ కృష్ణమూర్తి (8.2.2004 నుండి 15.5.2005), బిబి టాండాన్ (16.5.2005 నుండి 29.6.2006 వరకు) ప్రధాన కమిషనర్లుగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం ప్రధాన ఎన్నికల అధికారిగా ఉన్న ఎన్ గోపాలస్వామి 30.6.2006న బాధ్యతలు నిర్వహించారు. తొలివిడత ఎన్నికల తరువాత ఏప్రిల్ నెలలో ఆయన తప్పుకోనున్నారు.

★

ఎన్ని పార్టీలో ...!



ఎవరైనా దేశం మొత్తంలో ఎన్ని పార్టీలున్నాయని అడిగితే ఏమని సమాధానమిస్తారు? 6, ... 8 ... 10 ... 20 ....50 ... 100 ... ఇలా ఎలా సంఖ్యచెప్పినా తప్పేనండి బాబూ! ఎన్నికల సంఘం వద్ద నమోదైన మొత్తం పార్టీల సంఖ్య 1000కిపైనే! ఇంకా స్పష్టంగా చెప్పాలంటే 1055పార్టీలు! ఇన్ని పార్టీలున్నా ఏడు పార్టీలకే జాతీయహోదా ఉంది. బహుజనసమాజ్‌పార్టీ (ఏనుగు), భారతీయ జనతా పార్టీ (కమలం), భారత కమ్యూనిస్టుపార్టీ (కంకి, కొడవలి), భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) (సుత్తి, కొడవలి, నక్షత్రం), భారత జాతీయ కాంగ్రెస్ (హస్తం), నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (గడియారం), రాష్ట్రీయజనతాదళ్ (లాంతర)లను మాత్రమే ఎన్నికల కమిషన్ జాతీయ పార్టీలుగా గుర్తించింది. ఒక పార్టీకి జాతీయహోదాను ఇవ్వడానికి ఆ పార్టీ పోటీ చేస్తున్న రాష్ట్రాలసంఖ్య అక్కడ పొందిన ఓట్లను ఎన్నికల కమిషన్ పరిగణలోకి తీసుకుంటోంది. మరో 48 పార్టీలను రాష్ట్ర (ప్రాంతీయ) పార్టీలుగా ఇసి గుర్తించింది. ఆంధ్రప్రదేశ్‌నుండి తెలంగాణారాష్ట్ర సమితి (కారు), తెలుగుదేశం (సైకిల్) పార్టీలు ఈ విభాగంకింద గుర్తింపుపొందాయి. ఇవిగాక మరో వెయ్యి పార్టీలు కూడా నమోదయ్యాయి. వీటిని రిజిస్టర్డ్, అన్‌రికగ్నైజ్డ్ పార్టీలుగా ఎన్నికల కమిషన్ పేర్కొంటుంది. రాష్ట్రంలో నూతంగా ఏర్పడ్డ ప్రజారాజ్యం పార్టీ కూడా ఈ విభాగం కిందకే వస్తుంది. ఈ పార్టీలకు ఎన్నికల కమిషన్ ఎటువంటి గుర్తును రిజర్వు చేయదు. ఒకసారి ఎన్నికల్లో పోటీచేసి కనీస మొత్తంలో ఓట్లు పొందితే అప్పుడు ఆ పార్టీలకు గుర్తును రిజర్వు చేస్తుంది. ఎన్నికల బరిలో దిగే అభ్యర్థుల కోసం 59 గుర్తులను ఫ్రీ సింబల్స్‌గా ఇసి గుర్తించింది. ఇండిపెండెంట్ అభ్యర్థులతో పాటు రిజిస్టర్డ్ పార్టీల అభ్యర్థులకు కూడా వీటినుండే కేటాయిస్తుంది.

చూద్దామా

జునాఘడ్ గుజరాత్‌లో వుంది. ఈ ప్రాంతమంతా సస్యశ్యామలంగా వుంటుంది. ఒకప్పుడు చూడసామ వంశీయుల పాలనలో వుండేది. తరువాత మౌర్యులు, గుప్తులు, మైత్రికులు, సింధియన్లు, రాజపుత్రులు ఇలా ఎంతోమంది దాడులను చవిచూచింది. చివరకు గుజరాత్ పాలకుడు అహమ్మద్‌షా వంశీయుడైన సుల్తాన్ మహమ్మద్ బేఘరా వశమైనది. ఈ సుదీర్ఘకాలంలో, బౌద్ధ, జైన హైందవ, ఇస్లాం లాంటి అనేక మతవిశ్వాసాల, సంస్కృతుల సమ్మేళనంగా రూపొందినది. వర్తక వ్యాపారాలతో, ఐశ్వర్యభాండాగారంగా విలసిల్లింది. దీని వైభవం క్రీశ 1వ శతాబ్దం నుంచి 6వ శతాబ్దం వరకూ ఉచ్ఛస్థితిలో వుందని చెప్పవచ్చు. ఇక్కడి శిలాశాసనాన్ని బట్టి ఇది అశోకుని ఉప్పర్‌కోట విశేషాలు ముఖ్యంగా చూడాలి. ఇది జైనులకు పవిత్రక్షేత్రం. కొండ ఎక్కలేనివారికి డోలీలు దొరుకుతాయి. దారిలో అశోకుని శాసనాలు చూడవచ్చు. వాతావరణ ప్రభావానికి శిధిలం కాకుండా వీటిని రక్షించటానికి దీనిపైన చక్కని భవనం నిర్మించారు. అంటే గదిలో వుంటుంది. కొండభాగం. అతిపెద్ద రాతిమీద ఈ శాసనాలు ప్రాకృతభాషలో వున్నాయి. ఒక్కో రాచరికాన్ని చూస్తుంటే అద్భుతంగా మనస్సు నాకట్టుకుంటాయి.

కరిగిపోయిన చరిత్రకు చిరు చిహ్నాలు

మనదేశ చరిత్రలో ధృవతారగా నిలిచిపోయినవాడు అశోకుడు. ఎంతటి సువిశాల సామ్రాజ్యం ఆనాటి మగధ! దక్షిణాపథంలో కొంతభాగం తప్ప భరతవర్షమేకాక సమీప రాజ్యాలైన నేపాల్, ఆఫ్ఘనిస్తాన్ వరకూ విస్తరించి వున్న సువిశాల సామ్రాజ్యాన్నధిష్టించాడు. సకల భోగభాగ్యాలతో తన రాజ్యం సుభిక్షంగా వుంది. దానినే ఇప్పటికీ స్వర్ణయుగంగా కీర్తించబడుతోంది. అంతటి కీర్తిశిఖరాలనందుకున్న చక్రవర్తి ఖడ్గాన్ని త్యజించాడు. ధర్మాన్ని తన రాజ్యమంతటా ప్రచారం చేశాడు. ఈ ధర్మవిస్తరణలో అతడు చూపిన కార్యదీక్ష, సునిశితమైన ఊహాశక్తి, సాధించిన ధర్మపరిరక్షణ, ప్రపంచ చరిత్రలో మర్కెడా కానరావు. రాచబాటలు నిర్మించి వాటి కిరుప్రక్కలా వృక్షాలు నాటించి బాటసారులకు నీడ కల్పించటం దగ్గరనుంచి, మానవులకూ పశు పక్ష్యాదులకు సైతం ఆహారము, ఆరోగ్య విషయాలలో అతడు చేసిన ఏర్పాట్లు గమనిస్తే, అతడి ధర్మనిరతి, కరుణ ఎవరూ అందుకోలేని ఆదర్శంగా గోచరిస్తాయి.

అశోకుని శాసనాలు

బ్రహ్మాండమైన కూర్మరూపంలో వున్న ఈ రాతిమీద ప్రాకృతంలో 14 శాసనాలున్నాయి. ఎన్నో విషయాలను వీటిలో నిక్షిప్తపరచారు. అన్నీ విపులంగా వ్రాయటం ఇక్కడ సాధ్యంకాదు. వీటిలో సుదీర్ఘమైన 13వ శాసనం కళింగ యుద్ధపు బీభత్సం, అది అశోకుని పరివర్తనకు దారితీసిన తీరు వివరించారు. శాసనాలు చెక్కిన తరువాత ఆ రాతిని అద్దంలాగా పాలిష్ చేశారు. వీటిని చూచిన కొందరు పాశ్చాత్యులు ఇది





దర్బార్ హాల్

ఇత్తడి అని కొందరు, ఒకరకమైన పాలరాయి అని కొందరూ భ్రమ పడ్డారంటే ఇక్కడ ఎంత నైపుణ్యం ప్రదర్శించారో విదితమౌతుంది. ఇక్కడే రుద్రధాముని శాసనాలు (150 ఎడి) సంస్కృతంలో చెక్కారు. తరువాత స్కంధగుప్తుని (454 ఎడి) శాసనాలున్నాయి. ఇలా 700 సంవత్సరాల పాటు ఇక్కడ శాసనాలు వెలువడుతూ వచ్చాయంటే, ఈ గిరినార్ ఎంతటి ప్రాముఖ్యతగల నగరమో, ఎంతటి వైభవాన్ననుభవించిందో ఊహించుకోవచ్చు. ఇది మౌర్యులకూ, గుప్తులకూ ఒక రాష్ట్ర రాజధాని.

సుదర్శన తటాకం

ఈ పర్వతం మీదనున్న సుదర్శన తటాకానికి కట్ట వేసి నీటి నిలువకు అమర్చుకున్నది మౌర్య చంద్రగుప్తుని కాలంలో. ఇదే స్కంధగుప్తుని కాలంవరకూ అంటే 800 సం॥ ఈ నగరప్రజల నీటి అవసరాలను తీర్చింది. చివరకు ఈ సరస్సే నగరాన్ని పదేపదే ముంపునకు గురి చేయటం వల్ల అపారమైన ప్రాణనష్టం జరిగివుంటుంది. ఇదితప్పితే ప్రజల దాహార్తిని తీర్చే మార్గం లేకపోవటం వల్ల, ఈ ప్రాచీన నగరం కాలగర్భంలో కలసిపోయింది. ఆనాటి గిరినార్‌కు సంకేతంగా ఈ పర్వతం తలం మాత్రం నిలిచివుంది.

ఆది-కాది బావి

ఉప్పర్‌కోటలో ఈనాటికీ నిలిచివున్న బావిని సామ వంశస్థుల నిర్మించారట. దీని నిర్మాణం సక్రమంగా జరగకపోవటం వల్ల, ఆది, కాది అనే ఇద్దరు అక్కచెల్లెళ్ళు ఇక్కడ ఆత్మార్పణం చేసుకున్నతరువాత ఈ బావి పూర్తయిందట. ఇది ఆత్మార్పణా లేక వారిని బలి ఇచ్చారా అనేది సందేహం. మధ్యయుగాలలో ఇలాంటి దురాచారాలు సామాన్యమే. వారి పేర్లు మాత్రం ఈ బావికి స్థిరపడిపోయాయి. ఏదిఏమైనా ఇంత పర్వతంమీద, ఆనాటి పరిమిత సాంకేతిక పరిజ్ఞానంతో బావిని తవ్వటం సాహసమే. ఈ బావికి అమర్చిన వర్తులాకారపు సోపానాలు, పాతాళానికి చొచ్చుకుపోతున్నట్లుంటాయి. చూస్తేనే కళ్ళు తిరుగుతున్నాయి. ఇది ఈనాటి పరిజ్ఞానానికి గూడా సాహసకృత్యమనే చెప్పాలి.

నవఘన్ బావి

దీని నిర్మాణం విచిత్రంగా వుంది. 120 అడుగుల లోతున్న ఈ బావికి చుట్టూవున్న పర్వతపుటంచునే కిందకు దిగే దారిగా మలచారు. ఈ దారిగూడా 10 అడుగుల వెడల్పున విశాలంగా, క్రింది నీటిమట్టం వరకూ, పర్వతపుటంచుల చుట్టుకున్నట్లుగా క్రిందకు దిగుతుంది. అంతలోతున చీకటిగా వుంటుంది. గనుక జ్యోతులు వెలిగించటానికి ఏర్పాట్లు గూడా చేశారు. ఇదొక అసమానమైన సాహసకృత్యంగా కనిపిస్తుంది. ఎంతమంది శ్రమించివుంటారు. ఎంత ధనం వ్యయమై వుంటుంది. ఎన్ని సంవత్సరాలు పట్టివుంటుంది. ఇంతటి శ్రమకోర్చి నీటిని సమకూర్చ వలసిన నగర ప్రాధాన్యత ఎంతటిది!



రణక్‌దేవి మహల్

ఇది రాఖేందర్ సతీమణి రణక్‌దేవి రాజప్రాసాదం. ముందుభాగం శిధిలమైనా చిన్నకోటలా గుంటుంది. ఈమె గురించి ఇంతకు ముందు వ్రాశాను. మహమ్మద్ బేఘరా 1470లో ఈ కట్టడాన్ని జామి మసీదుగా మార్చాడు కాని, ఏ కారణంగానో ఇది పూర్తికాలేదు. రెండుమూలలా మాత్రం మినార్‌లు నిర్మించారు. మహల్ మధ్య హాలు 140 స్థంబాలమీద సువిశాలంగా నిర్మించారు. 15 అడుగుల ఎత్తున్న ఈ స్థంబాలు దర్పంతో నిలబడివుంటాయి. గిరినార్‌కు బేఘరా, ముస్తాఫాబాద్ అని పేరుగూడా పెట్టాడు.

నీలమ్‌టోప్

మధ్యయుగాలనాటి మరో గుర్తు ఇక్కడున్న ఫిరంగి నీలమ్‌టోప్. ఇక్కడ డయ్యుని ఆక్రమించుకున్న పోర్చుగీసువారిని తరిమివేయటానికి టర్కీసుల్తాన్ సులేమాన్ 1538 లో యుద్ధసన్నాహాలతో వచ్చాడట. ఎందుకంటే ఇక్కడ పోర్చుగీసువారి ప్రాబల్యం పెరగటమేకాక, వారు ఆనాటి పాలకుడు బహదూర్‌షాను జయించి వధించారు. కానీ సులేమాన్ విజయం సాధించలేకపోయాడు. అలా ఆయన వదలిపోయిన రెండు ఫిరంగులు ఇక్కడుండిపోయాయి. ఒకటి నీలమ్‌టోప్. దీనిని ఈజిప్టులో 1531 ఎడిలో తయారుచేశారట. రెండవది చూడావల్ ఫిరంగి. ఇది కొంత దూరాన వుంది.

బౌద్ధగుహలు

ఇక్కడ బౌద్ధగుహల నిర్మాణం 7వ శాతాబ్ద వరకూ సాగింది. హుయాన్‌త్సాంగ్ కథనం, ఇక్కడ 50 బౌద్ధారామాలుండేవనీ, మూడువేలమంది బౌద్ధభిక్షువులు వుండేవారని, ఈ గుహలన్నీ శిధిలమైపోయాయి. వీటిలో చూడదగ్గవి జామిమసీదు దగ్గరనుంచి ఆదికాది బావి వరకూ వుంటాయి. వీటిని కొండపైనుంచి క్రిందికి 3 అంతస్థులుగా తొలిచారు. క్రింత కొలను మలచారు. వర్షపునీటిని దీనిలో నిలవ చేసుకునేవారు. ఇక్కడ క్రింద అంతస్థుకున్న స్థంబాలకు కింద, పైనున్న భాగాలలో మలచిన శిల్పసౌందర్యం ఇప్పటికీ కనువిందు చేస్తుంది.

జైన ఆలయాలు

దేశంలో బౌద్ధశిధిలాలున్నచోటల్లా జైన మందిరాలు కనిపిస్తాయి. ఇక్కడ జైన మందిరాలన్నీ ఒకేచోట వుండి ఈ సముదాయం చిన్న కోటలాగుంటుంది. ఇక్కడున్న 16 ఆలయాల్లో చాలా శిధిలమైపోయాయి. ఇవి జైన తీర్థంకరులు, నేమినాథుడు, మల్లినాథుడు, ఋషభనాథుడు, పార్శ్వనాథుడు, మహావీరుడు మొదలగు వారికి నిర్మించినవి. ఇక్కడి ప్రాముఖ్యత ఏమిలంటే నేమి నాథుడు ఇక్కడ నివసించాడు. ఇక్కడే శరీరత్యాగం చేశాడనీ చెబుతారు. అందుకే వారికిది పవిత్రభూమి.

మేము కొండదిగివచ్చి జునాఘడ్ వెళుతుండగా ఇక్కడ జైలు ప్రక్కనున్న రెండు అద్భుత కట్టడాలు మనల్ని కట్టిపడవేస్తాయి. అతి మనోహర రూపాలవి. అందులో ఒకటి మొహబ్బత్‌ఖాన్ సమాధి. రెండవది బహద్దీన్ సమాధి. వీటికున్న డోమ్స్, ఆర్చీలమీద, ఎంత అద్భుతమైన నగిషీలు చెక్కారంటే మనం



చూపు మరల్చుకోలేము.

జునాఘడ్‌లోని, సిలేఖానా (ఆయుధాగారం) ఆనాటి ఆయుధాలు, ఇక్కడి కళ్ళుచెదరే దర్బారుహాలులో ఆనాటి రాచరికపు వైభవచిహ్నాలు కన్నులపండువగా దర్శనమిస్తాయి. ఇదిప్పుడు మ్యూజియంగా మారింది.



గిరి అభయారణ్యం ఇక్కడికి దగ్గరలోనే వుంది. ఇది సింహాలకు ప్రత్యేక ఆవాసం. దట్టమైన అరణ్యాలు వన్యమృగాలే కాక, దీనికి మరో ప్రత్యేకత సిద్దీలు అనే ఆఫ్రికా తెగవారు ఇక్కడ గ్రామజీవనం గుడుపుతున్నారట. కొన్ని తరాల ముందు, జునాఘడ్ పాలకులు, వీరిని ఆఫ్రికా నుంచి రప్పించారట. కాని వారు అడవిదాటి రారు. ఎవరితోనూ కలువరు. వారిలో వారే వివాహాలు చేసుకుంటారు. ఈ విధంగా వారి ప్రత్యేక జీవన విధానం, శారీరక లక్షణాలు అలాగే కొనసాగుతున్నాయట. పర్యాటకులకు అక్కడ మంచి హోటళ్ళుంటాయిగానీ వాటి ఖర్చు భరించలేము.

జునాఘడ్‌లోని ముస్లిం పాలన మనకు స్వరాజ్యం సిద్ధించే వరకూ కొనసాగింది. ఆనాటికిది స్వతంత్రరాజ్యము దేశ విభజన సమయంలో స్వతంత్ర రాజ్యాలు ఇండియాలో కాని, పాకిస్తాన్ కాని, వారికిష్టమైనవిధంగా చేరిపోవచ్చు. లేదా స్వతంత్ర రాజ్యంగానే వుండిపోవచ్చు. అప్పటికి దాదాపు 560 స్వతంత్ర రాజ్యాలుండేవి. బ్రిటీషువారు పోతూపోతూ దేశాన్ని రెండుగా చీల్చటమేకాక, మరో 560 ముక్కలుచేసి మనకు స్వాతంత్ర్యం ప్రసాదించాలనకున్నారు. అప్పటి జునాఘడ్ నవాబు రసూల్‌ఖాన్. వీరి దివాను నవాజ్‌భుట్టో. వీరిద్దరికిద్దరూ విచిత్ర వ్యక్తులే. ఈ నవాబుగారు తాను పాకిస్తాన్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. పాకిస్తాన్ కూడా జునాఘడ్‌ను విలీనం చేసు కుంటున్నట్లు ప్రకటించింది. కాని ప్రజల్లో అధిక సంఖ్యాకులు హిందువులకు పశ్చిమ కాశీగా పరిగణించబడే సోమనాథ్, ప్రభాసతీర్థం, ఇలా అనాదిగా హిందూ జైనధర్మాలకు పట్టుకొమ్మలుగా నిలచిన పుణ్యక్షేత్రాలు జునాఘడ్ రాజ్యంలోనే వున్నాయి. ఎన్ని ప్రయత్నాలు చేసినా నవాబు లొంగిరాలేదు. అప్పటి హోంమంత్రి వల్లభాయిపటేల్, కతియవార్‌లోని సంస్థానాధీశ్వరులనందరిని, జునాఘడ్ ముట్టడికి సర్వసన్నద్ధంగా వుండమని హెచ్చరించాడు. ఆ సమయంలో 51 గ్రామాలున్న చిన్నప్రాంతం బాబరేవాడాలోని గిరాఫీ తెగ ఆదివాసులు, తాము భారత్‌లో విలీనమౌతున్నట్లు ప్రకటించారు. భారత సైన్యాలిక్కడకు చేరుకుని జునాఘడ్ ముట్టడికి సన్నద్ధమైనారు. ఈ సమయంలోనే జునాఘడ్‌లోని ప్రముఖ స్వాతంత్రయోధులు, సమాంతర ప్రభుత్వాన్ని ప్రకటించి రాజకోట నుంచి పాలన మొదలుపెట్టారు. నలువైపులా క్రమ్ముకుంటున్న పరిణామాలను గ్రహించి, నవాబు, భారత్‌లో విలీనాన్ని ప్రకటించాడు. వారి దివాన్, భుట్టో అంతకుముందురోజే కరాచీ వెళ్ళిపోయాడు. ఈ విధంగా జునాఘడ్ 9.11 1947 న భారత్‌లో విలీనమైంది.

★

ఆ డబ్బు అందుతుందా!

ప్లీడరు గారూ! నాదో సమస్య. మా దగ్గరి బంధువు ప్రభుత్వ ఉద్యోగం చేసేవాడు. అయితే అతడి సహోద్యోగికి శ్రీరాం చిట్ ఫండ్‌లో జమానత్ ఉన్నాడు. చిట్టీ ఎత్తిన ఉద్యోగి డబ్బులు కట్టకుండానే చనిపోయాడు. చిట్టీవారు కోర్టులో దావా వేసి మా బంధువు పెన్షన్ బెనిఫిట్స్‌ని అటాచ్‌మెంట్ చేశారు. ఈ మధ్య కాలంలో మా బంధువు ఆ డబ్బులు రాకముందే చనిపోయారు. చిట్టీ ఎత్తిన వ్యక్తి కొడుకులు బాగానే ఉద్యోగం చేస్తున్నారు. ఆ డబ్బులు మా బంధువు పిల్లలు, భార్యా కోల్పోవలసిందేనా? తెలుపగలరు.

ఓ పాఠకుడు, ఆదోని.

ఉద్యోగస్తుల జీతం అటాచ్‌మెంట్ చేయవచ్చు గానీ పెన్షన్ మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అటాచ్‌మెంట్ చేయకూడదు. అలా అటాచ్‌మెంట్ అయి అతడికి పెన్షన్ బెనిఫిట్స్ రానట్లయితే మీరు హైకోర్టులో కేసు వేసి అటాచ్‌మెంట్‌ను రద్దు పర్చుకోవచ్చు. చిట్టీ ఎత్తిన వ్యక్తి వారసులు ఉద్యోగస్థులయితే, ఆ విషయం మీరు చిట్స్ వారికి కూడా తెలియ పరచండి. వారి ఉద్యోగం, హోదా, అడ్రసులు తెలియపరిస్తే వారిని పార్టీలుగా వేయడంతో ప్రస్తుతం వారు ఉద్యోగస్థులు కావున క్లయిమ్ వారి మీదికే వెడుతుంది.

నష్టపరిహారం రావాలంటే...

మా భూమి రోడ్డు పక్కగా ఉంది. ప్రభుత్వం రోడ్డు విస్తరణ చేస్తుందని తెలిసింది. కొలతలు కూడా వేశారు. మాకెలాంటి నోటీసు రాలేదు. ఆ భూమి పక్కన మాకు 5సెంట్లు జాగా ఉంది. ప్రస్తుతం అది రోడ్డు విస్తరణలో పోతుంది. మా తాతగారు కొన్నది పట్టా భూమి. కానీ ప్రభుత్వం వారు ఆసామి పేరే రాసుకున్నారు. నష్ట పరిహారం రావాలంటే మేము ఏం చేయాలి?

- అబ్దుల్ సాజిద్, కొల్లూరు.

ఆ భూమి మీ పేరు మీద ఉంటే మీకే నష్టపరిహారం ఇస్తారు. మీరీ విషయం అధికారుల వద్ద విశదపరచండి. లేదా ఆర్.డి.ఓ వద్ద, భూసేకరణ అధికారి వద్ద మీ క్లయిమ్ పిటీషన్ వేయండి. మీ దస్తావేజులు చూపించండి. అట్టి డబ్బులు మీకే అర్హత ఉన్నట్లు, యజమాని పేరే అయినట్లు కోర్టుకు తగిన విధంగా ప్రొడ్యూస్ చేయండి. మీ డబ్బులు మీకు వస్తాయి.

జి.ఎల్. నరసింహారావు,
హైకోర్టు న్యాయవాది,
హైదరాబాదు.
ఫోన్ : 9848894240

కథ

శేష జీవితం

- మంతెన సూర్యనారాయణ రాజు



దారి పొడుగునా కనిపించిన వాళ్ళనందర్నీ ఆయన ఆపి మరీ అడుగుతున్నాడు. అతను సంధించిన ప్రశ్న విన్నవాళ్ళంతా కొందరు ముఖంమీదే, మరికొందరు చాటుకెళ్ళి, ఇంకొందరు వెనుదిరిగి-నవ్వుకుంటున్నారు. ఇంతకీ ఆవిడ ఎక్కడికెళ్ళినట్టు? ఎందుకెళ్ళినట్టూ! అంటూ అనుమానంతో ఆయనని నిలదీసే వారులేకపోలేదు. అడిగిన పెద్దమనిషి వాళ్ళమాటలేవీ పట్టించుకోవడంలేదు. నైరాశ్యంతో ముందుకుపోతున్నాడు. ఈలోగా ఎవరో కుర్రాడు అతనికి దగ్గరగా వచ్చి "తాతా! అమ్మ పిలుస్తోందిరా! టీ తాగిపోదువు గాని" అన్నాడు. అప్రయత్నంగానే వెనక్కు దిరిగాడా అరవై ఐదేళ్ళ కళ్ళజోడాయన. రోజూ స్కూలుకుపోయే పంతులమ్మ సావిత్రీ మేడం దర్శనమిచ్చింది. ఆ పెద్దాయన కళ్ళజోడు సవరించుకుంటూ బోసినోటితో "సావిత్రీ మేడమ్! మాయావిడ శాంత ఎక్కడైనా కనిపించిందా!?" అదే ప్రశ్న. అంతక్రితం అందర్నీ అడిగిన ప్రశ్న. సావిత్రికి మనస్సు చివుక్కుమన్నట్లు బాధపడింది.

తాతగార్ని సమాధాన పరచాలని దగ్గరగా వచ్చింది సావిత్రి. "ఆ... చెప్పింది వినిపించింది కమలాకరరావు గారూ. నేను అటువైపే వెళ్తున్నా! శాంతగారు కనిపిస్తే, మీకోసం మీ వారు కళ్ళకాయలు కాచేలా చూస్తున్నారు" అని చెప్పి "వెంటనే పంపిస్తాలెండి" అంది వెళ్ళిపోతూ సావిత్రి. తను చెబుతున్నది అబద్ధమని ఆమెకు తెలుసు. కమలాకరరావు భార్య శాంత చనిపోయిన దగ్గర్నుంచీ పిచ్చిపట్టినట్టైపోయాడు. అలాగని పూర్తి పిచ్చివాడనుకోవడానికీ వీల్లేదు. చిత్త చాంచల్యం అని సరిపెట్టుకోవాలి. అంతే! తిండి-తిప్పలు సరిగా చూసుకోడు. జుట్టుకు నూనె రాయడు. సరైన బట్టలు ధరించడు. కమలాకరానికి రెండు పెళ్ళిళ్ళు. ముందు భార్య కోమలి. ఆమె పెళ్ళైన ఏడాదికే ఒక ఆడబిడ్డను కని ఏదో జబ్బుతో మరణించింది. ఆ పిల్లే లక్ష్మి. పద్నాలుగేళ్ల క్రితమే పెళ్ళిచేసి బాధ్యత తీర్చుకున్నాడు. అదృష్టంకొద్దీ లక్ష్మి భర్త ఇంజనీరుగా వుంటూనే అమెరికా ఛాన్సొస్తే అక్కడికి వెళ్ళి ఎనిమిదేళ్లయ్యింది. రెండో భార్య శాంత. ఆమె కొడుకే జగదీష్. ఊళ్ళోనే డిగ్రీ చదివించి ఓ ప్రైవేట్ ఫర్మ్‌లో ఉద్యోగం వేయించాడు కమలాకరం. పదేళ్ళుగా జగదీష్ ఉద్యోగం చేస్తున్నాడు. అతని భార్యే సుగుణమణి. వారి సంతానమే ఎనిమిదేళ్ళ ప్రసాదు. కాన్వెంటులో థర్డ్ స్టాండర్డ్ చదువుతున్నాడు.

శాంత పోయిన కొత్తలో జగదీష్‌కి జడిసి సుగుణమణి మావగారైన కమలాకరాన్ని బాగానే చూసుకుంది. రెండో భార్య శాంతంటే కమలాకరానికి ఎంతో ప్రేమ. ఆమె పోయిన కొత్తలో వీధులమ్మట బిచ్చగాడికి తక్కువ. రాజకీయనాయకుడికి ఎక్కువ అన్నట్టు తిరుగుతూండేవాడు. రానురాను అదే అనుదిన కార్యక్రమం అయిపోయింది. ఎక్కడ బడితే అక్కడ, ఎవరింట్లో పెడితే అక్కడ తినడం, టీ, కాఫీలు తాగడంతో జగదీష్‌కి చిర్రెత్తుకొచ్చేది. బైటి తిళ్ళు,

టీ,కాఫీలు తాగటాలు బంద్ చెయ్యమని తండ్రికి చెప్పాడు. అతను విన్లేదు. దానితో తండ్రి గురించి అంతగా పట్టించుకోవడం మానేశాడు. జగదీష్ భార్య సుగుణమణి పచ్చి అవకాశవాది. అప్పట్నుంచీ మావగారు బ్రతికున్నాడనే ఆవాహనంలోనే ఉండేదికాదు. పసివాడు ప్రసాద్ అంటే కమలాకరరావుకి వల్లమాలిన ప్రేమ. కొడుకు ప్రసాదు మావగార్ని తీరుకురాగానే గ్లాసుతో అతనికి టీ ఇచ్చింది. ఆత్రంగా టీ తాగి ఆ గ్లాసు అక్కడ పెట్టి వీధిలోకి వెళ్ళిపోయాడు కమలాకరం. మళ్ళీ కథ మామూలే.!

ప్రతినెలా అది ఆదివారం కాకుండా వుంటే తప్ప, ఒకటో తారీఖున తండ్రిని బైక్ మీద ఎక్కించుకుని టంచన్‌గా బ్యాంక్‌కు తీస్కెళతాడు. కమలాకరరావు పెన్షన్ తాలూకు నాలుగువేల రూపాయలూ తండ్రి చేత విత్ డ్రాయల్ మీద సంతకం పెట్టించి డ్రా చేసి తెచ్చుకుంటాడు. కనీసం తండ్రికి ఖర్చులకైనా ఒక్క యాభై రూపాయలు చేతిలో పెట్టడు. ఆ సొమ్ము ఖర్చు చేస్తాడు. మంచి ఖాతాలు దొరికితే మిగిలిన సొమ్ము రెండు రూపాయల వడ్డీకి తిప్పుకుంటాడు. తండ్రి బ్రతికున్నాడన్న విషయం గుర్తుకొస్తే పండక్కో, పబ్బానికో ఎవరైనా నిలదీస్తే చొక్కా కుట్టిస్తే పంచ కొనడు. ఒకవేళ పంచెకొంటే చొక్కా మానేస్తాడు. అదీగాక తండ్రి తాలూకు చుట్టాలకు, మేనత్తలకు ఏవో కుంటిసాకులు చెబుతూ ఏది కొంటానన్నా మా నాన్న అన్నింటికీ వద్దంటున్నాడని చెప్పడం అతనికి పరిపాటయ్యింది. చేతిలో పైసాలేక బస్సు స్టాండులో ఎవరినో యాచించి తండ్రి న్యూస్ పేపర్ కొనడం జగదీష్ చూశాడు. తల కొట్టేసినంత పనయ్యింది. మోటర్ బైక్ మీద ఇంటికి తీసుకొచ్చి బాగా తిట్టాడు. కొట్టినంత పని చెయ్యబోయాడు. అతనికి సుగుణమణి వంతపాడింది. నూతిలో దూకి చావబోతున్న కమలాకరాన్ని పక్కింటి వాళ్ళు తీశారు. పరిగెట్టుకొచ్చి అతని ప్రయత్నాన్ని ఆపారు. జగదీష్‌ని నాలుగు జాడించారు. దానితో కొడుకుగా తన తండ్రి ఆలనా పాలనా పట్టించుకోక తప్పలేదు.

◆ ◆ ◆

ఒక రాత్రివేళ దోమలు కుడుతుంటే కమలాకరరావు లేచాడు. కొడుకు కోడలు వున్న గదిలో లైటు వేసి వుంది. ఏవేవో మాటలు స్పష్టాస్పష్టంగా వినిపిస్తున్నాయి. సుగుణమణి గొంతు గట్టిగా వినబడుతోంది. వినకూడదనే జ్ఞానం తనకున్నా అవి వినిపిస్తున్నాయి. "మీరు లక్ష చెప్పండి. ఆయనగార్ని చూడ్డం నావల్లకాదు. కాస్సేపు నడుం వాల్చి పడుకోనివ్వడు. పది నిమిషాలు టీవీ చూడనివ్వడు. పని వున్నాలేకున్నా ఇంట్లో వున్నంత సేపూ అటూ ఇటూ తచ్చాడుతుండడం నాకిష్టం లేదు. మాటి మాటికీ మంచినీళ్ళంటూ చంపుకుతింటాడు. నామాట విని ఏ ఓల్డేజ్ హోమ్ లోనైనా చేర్పించేయండి. పీడా విరగడవుతుంది" అంది. కన్న కూతురు లక్ష్మి కన్నా సుగుణని ఎక్కువగా చూశానే! సవతి బిడ్డైనా తనముందు భార్య కూతురితో సమానంగా గౌరవించానే! అటువంటిది నన్ను, కోడలు సుగుణ ఓల్డేజ్ హోమ్లో చేర్పించమంటోందా! అంటూ కమలాకరం నొచ్చుకున్నాడు. భార్య మాటలకు కొడుకేమంటాడో వినాలని చెవులు అటువైపు పారేశాడు.

"మీరు లక్ష చెప్పండి. ఆయనగార్ని చూడ్డం నావల్లకాదు. కాస్సేపు నడుం వాల్చి పడుకోనివ్వడు. పది నిమిషాలు టీవీ చూడనివ్వడు. పని వున్నాలేకున్నా ఇంట్లో వున్నంతసేపూ అటూ ఇటూ తచ్చాడుతుండడం నాకిష్టం లేదు. మాటి మాటికీ మంచినీళ్ళంటూ చంపుకుతింటాడు. నామాట విని ఏ ఓల్డేజ్ హోమ్ లోనైనా చేర్పించేయండి. పీడా విరగడవుతుంది"

జగదీష్ "అబ్బా సుగుణా! నీ మాటలు నీవే గాని నామాట వినవు. అలా చేస్తే ఆయన పెన్షన్ ఆ ఓల్డేజ్ హోమ్‌కి కట్టాల్సొస్తుంది కదా అది గ్రహించవే!" అన్నాడు. " ఔనండోయ్.. అదీ నిజమే! మరెలాగిప్పుడు? మీ సవతి అక్కయ్యను మీ నాన్న ఖర్చులకుగాను అదేనండి మందో మాకో కొనాలని పెన్షన్ చాలడం లేదని మరో వంద డాలర్లు అమెరికా నుంచి పంపమని చెప్పండి" అంది. సిగరెట్ వెలిగించి జగదీష్ అటూఇటూ తిరిగి భార్యతో "నెమ్మది. నాన్న లేస్తాడు. నెమ్మదిగా మాట్లాడు. నువ్వు చెప్పినట్లుగా అక్కకి ఫోన్ చేసి డాలర్లు పంపమన్నందుకు ఏమీ బాధపడదు గాని... బావగారు తెలివైనవారు. నువ్వుండే ఇంటికి అద్దెలేదు. ఐదు అంకెలజీతం సంపాయిస్తున్నావు. తండ్రికి తిండి పెట్టలేకపోతున్నావా" అని తిరగేస్తే! పైగా నెలనెలా అక్కయ్య ఐదువేలు పంపిస్తోంది. అవి కూడా ఇంటి ఖర్చులకి, సేవింగ్సు రూపేణా దాచుకుని దోచుకుంటున్నాం గదా!" అన్నాడు.

సుగుణమణి మంచినీళ్ళు తాగుతూ మావగారు లేచిన జాడ పసిగట్టింది. గొంతు బాగా తగ్గించి "ఏవండోయ్ ముసలాయన లేచాడు. కొంపదీసి మనం మాట్లాడుకుంది వినుంటాడంటారా!" అని భర్తని అడిగింది. జగదీష్ సిగరెట్ ఆర్పి దూరంగా పారేస్తూ "నానా! మంచినీళ్ళేమైనా కావాలా!" అని దగ్గరకెళ్ళి అడిగాడు. కమలాకరం అక్కర్లేదన్నట్లు తల అడ్డంగా ఆడించాడు. లైటు తీసి ఇద్దరూ నిద్రపోయారు.

వృద్ధులపట్ల నిర్లక్ష్యం, వారి నిస్సహాయత అవకాశంగా తీసుకోవడం, ప్రేమగా పెద్ద వాళ్ళైన తల్లిదండ్రులపట్ల కుటుంబ సభ్యులే నిరాదరిస్తుంటే ఆ స్థితి ఎంతో దుర్భరమనిపిస్తుంది. బహుశా వీధీ వాడా వెలుస్తున్న వృద్ధాశ్రమాల వెనుక కథలు కూడా ఇటువంటివే అనిపిస్తాయి. తెల్లవారితే దీపావళి పండగని నరక చతుర్దశి నాడే భర్తకి, కొడుకు ప్రసాద్‌కి, ఆటలో అరటిపండులా భావించే మావగారికి తలంటు పోసే పనిబెట్టుకుంది సుగుణమణి. జగదీష్ స్నానానంతరం ఏదో స్థలం కొనే ప్రయత్నంలో బిజీగా ఉన్నాడు. ముందుగానే పండక్కి సరుకులన్నీ తెచ్చి పిండివంటలు చెయ్యమని భార్యకు పురమాయించాడు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఇంటికొచ్చాడు. పెళ్ళాన్ని పిల్చి "సుగుణా! నీ పేర మూడువందల గజాల స్థలం ఐదులక్షలు పెట్టికొన్నాను" అన్నాడు. "అదేవిటండీ నాతో మాట మాత్రమైనా చెప్పకుండా చేశారు. అయినా అంత డబ్బెక్కడిది మనదగ్గర" అంటూ అమాయకంగా అడిగింది.

నాన్న పెన్షన్ తాలూకు డి.ఎ. ఎరియర్స్ గట్రా, అక్కయ్య పంపిస్తున్న డాలర్ల పంట, నాజీతంలో సగం సగంగా మిగిలిన నిలవా, వడ్డీలకిచ్చిన సొమ్ము కలిపిస్తే సింపుల్‌గా ఐదు లకారాలయ్యింది. నీకిప్పుడు తృప్తిగా వుందా అన్నాడు. అమ్మో అంటూ బుగ్గలు నొక్కుకుంటూ 'లోపలికెళ్ళి టీ పట్టుకొస్తాను శుభవార్త చెప్పారుగా' అంది సుగుణమణి. 'ఇంతమంచి విషయం చెబితే ఓన్లీ టీయేనా ఇచ్చేది' అన్నాడు. బుంగమూతి పెడ్తూ జగదీష్. రేపు దీపావళి అమావాస్య గదా!

మీకిష్టమైనవన్నీ చేసి పెడతా సరేనా! అని లోనికెళ్లింది.

పండగ రావడం ఎంత? ఇరవైనాలుగు గంటలు ఇట్టే గడిచిపోవడం ఎంత? ప్రొద్దుట్నుంచీ సుగుణ వంటింటిని వదిలి బైటికి రాలేదు. భర్త పనిమీద బైటికెళ్తుంటే చనిపోయిన అత్తగారు శాంతపేరు చెప్పి భర్తకు నాలుగు బూరెలు పెట్టింది. కొడుక్కి జంతికలు, అరిసెలు అంటే ఇష్టమని చేసి కేన్లో భద్రంగా దాచింది. మావగారైన కమలాకరరావుకి పొద్దున్నే రెండంటే రెండే ఇడ్లీలు పెట్టి, కొద్దిగా కాఫీ ఇచ్చి బైటికి తరిమేసింది. పానకంలో పుడకలాగ ఆయన గారు తన పనులకు ఎక్కడ అడ్డుతగులుతారోనని ఆమె ఉద్దేశం. రెండు గంటలవేళ మావగారికి భోజనం పెట్టి మంచంమీద వాలిపోయింది. సుగుణమణి.

కమలాకరం రెండు బూరెముక్కలు తిందామని, అటుపై బైటికి పోవాలనీ ఇంట్లో అన్ని డబ్బాలూ వాటికోసం గాలించాడు. అబ్బే! ఎక్కడో ఏడు ఇరుకుల్లో పెట్టుటుందని అతనికి తెలుసు. కుదురులేక చేతికందిన రెండు పెద్దపెద్ద బరువైన క్యాన్‌లను తీసుకుని వీధినబడ్డాడు. చుట్టాలింటికి చూపుగా వెళ్ళి అక్కడ వాటిని పెట్టి మరిచిపోయి, బజారువైపు వెళ్ళిపోయాడు. గుడిలో ఏదో కార్యక్రమం జరుగుతుంటే అక్కడి కెళ్లికూర్చున్నాడు.

ఓ కునుకుతీసి సుగుణమణి పిల్లాడికి జంతికలవీ పెట్టాలని రెండు క్యాన్ల గురించి చూస్తే అవి పెట్టినచోట నుండి మాయమయ్యాయి. పిల్లాడి మీద, పనిమనిషి మీదా మీరేమన్నా తీశారా అంటూ అరిచింది. వాళ్ళు తమకేం తెలీదన్నారు. అప్పుడే అక్కడికొచ్చిన జగదీష్ "సుగుణా నాన్నకు బూరెలంటే చచ్చేటంత ఇష్టం. ఆయనగారికి పెట్టావా వాటిని" అని అడిగాడు. "అవును మావయ్యేరీ" అంటూ నలువైపులా గాలించింది. వెంటనే చిర్రెత్తుకొచ్చి భర్తతో "మీరుగాని బూరెలు, అరిసెలు, జంతికలు దాచిన క్యాన్లు తీశారా! తీసి ఎక్కడన్నా పెట్టారేమో గుర్తుచేసుకోండి" అంది. 'ఏమో నాకేం తెలుసు?' అన్నట్లు చూశాడు జగదీష్. పక్కింటి పిన్నిగారు అక్కడికొస్తూ "సుగుణా! మీ మావగారు ఇందాక అంటే రెండు దాటాకనే ఏవో రెండు క్యాన్లు చేత్తోపట్టుకుని మీ చుట్టాలింటి వైపు వెళ్ళడం చూశాను" అంది.

"ఛ!ఛ! ఏమిటి మనిషి. ఇంట్లో సామాను, ఇలా తినే బూరెలూ, అరిసెలూ లాంటి తినుబండారాలు పెట్టినవి పట్టుకుపోతాడా" అని ఎగిరెగిరి పడింది. జగదీష్ పరుగు పరుగున వెళ్ళి తెలిసిన వాళ్ళయిళ్ళు అన్నీ వెదికితే ఓ చోట ఆక్యానులు గుర్తుపట్టాడు. ఆ ఇంటి యజమానురాలితో "పిన్నీ ఇవి మావే. తీస్కెళ్తున్నా"! అన్నాడు. వరుసకు పిన్ని అయిన ఆమె జగదీష్‌తో "చూడ్రా అబ్బాయ్! ఆయనకు రెండు బూరెముక్కలైనా పెట్టకుండా దాచుకు తింటున్నారల్లే ఉంది మీ వరస చూస్తే! ఎంతైనా నీకన్న తండ్రి ఆయన. తింటే పోతుంది. ఆయనకు మాత్రం ఎవరున్నారు చెప్పు. మీ సవతి అక్క ఎక్కడో దేశంకాని దేశంలో వుంది. నువ్వైనా కాస్త ఆయన ఆలనా పాలనా చూడకపోతే ఎలారా!" అంది. జగదీష్‌కి ఆమె మాటలు చాచి లెంపకాయ కొట్టినట్టు అనిపించి మారు మాట్లాడకుండా తల వంచుకుని వాటిని తీసుకుని వెళ్లిపోయాడు.

◆ ◆ ◆

"కమలాకరంగారు మీకు ఏమౌతారు?" అంటూ అడిగాడు. జగదీష్‌ని చేత్తో పొడుస్తూ సుగుణమణి నెమ్మదిగా "మనకేం కారని చెబుదురూ! లేకపోతే కేసులు, కోర్టులు, లాకప్‌లు వెధవ సంత" అని గొణిగింది. జగదీష్ అతి ప్రయత్నంమీద "మాకేం... కారు" అన్నాడు. ఎస్.ఐ "పక్కా..." అన్నాడు అనుమానంగా గుడ్లు పెద్దవి చేస్తూ.

వాకిట్లో ఆటలాడుకుంటున్న మనవడు ప్రసాద్ దగ్గరకొచ్చాడు కమలాకరరావు. తానూ చిన్న పిల్లవాడై పోతూ "చిన్నా! నీకోసం కాకరపువ్వొత్తులు, మతాబులు, అగ్గి పెట్టెలు, భూ చక్రాలు, పాము బిళ్ళల పెట్టెలు ఎన్నో తెచ్చాను. ఒక్కటీ మిగల్చకుండా అన్నీ నువ్వే కాల్చేయాలి" అని పాలథీన్ సంచిలోవి మనవడికి తీసి ఇచ్చాడు. సుగుణమణి అక్కడికొస్తూ ఆశ్చర్యచకితురాలై వాటిని పరిశీలించి ఇవన్నీ ఎక్కణ్ణుంచైనా ఎత్తుకొచ్చారా!? లేక ఎండ బెడితే వాళ్ళని ఏమార్చి చూడకుండా తెచ్చేశారా!" అంటూ నిలదీసింది. ముఖం చిన్నబుచ్చుకుంటూ అదోలా చూస్తు కోడలితో "దొంగతరం అనేది మా ఇంటా వంటా అలవాటు లేదు. నా బెస్టు ఫ్రెండ్ పూర్ణచంద్రరావు కలిశాడు. వాడి మనవడికి కొంటూ నా మనవడికీ ఇమ్మని ఇవి కొని ఇచ్చాడు. నేనేం అడుక్కుని, ముష్టెత్తి తేలే!" రోషంగా అన్నాడు. పండగపూటా పైసా ఖర్చు లేకుండా మావగారు అన్ని మందుగుండు సామాను తెచ్చినందుకు, వాటిని పాలిథిన్ సంచిలోకి సర్ది, పిల్లాణ్ణి వెంటబెట్టుకుని లోనికి వెళ్ళిపోయింది సుగుణమణి.

చేతులూ కాళ్ళూ కడుక్కురమ్మని కరుణాకరానికి భోజనం వడ్డించింది. ఎక్కడైనా ఏ పురాణ కాలక్షేపమైనా వుంటే వెళ్ళిరండి. అర్ధరాత్రి రాకండి . పెందలాడే వచ్చేయండా అంటూ అతగాణ్ణి బైటికి తరిమేసింది. ప్రసాద్ టీవీలో పండగ ప్రోగ్రాములు చూస్తూ కూర్చున్నాడు. వాడికీ అన్నంపెట్టి ఒళ్ళో పడుకోబెట్టుకుని పెందరాలే నిద్రపుచ్చింది. ఎనిమిదిన్నర గంటలు దాటుతూండగా జగదీష్ ఇంటికొచ్చాడు. బాగా అలిసిపోయి వున్నాడు. మామతెచ్చిన మందుగుండు సామాన్ని చూపించి భర్తతో "వీడు పడుకున్నాడు. వీటిని తెలివిగా మార్కెట్టుకి తీస్కెళ్ళి అమ్మి పైకం తెండని" ఆర్డర్ వేసింది సుగుణ. జగదీష్ ముందు ఒప్పుకోకపోయినా, తర్వాత భార్య చెప్పినట్లు చేసి రెండువందల ఏభై రూపాయల సొమ్ము తెచ్చాడు. ఇద్దరూ భోజనం చేసి పడుకున్నారు. ఒకరాత్రి ప్రసాదుకి మెలకువ వచ్చింది. వాడు తల్లిని లేపుతూ "నా పటాసులేవి!! నేనిప్పుడు అవన్నీ కాల్చేస్తా!" అంటూ మారాం చేశాడు. ఈలోగా పోలీస్ జీప్ అటుగా పహారా కొచ్చింది. సుగుణ వాణ్ణి వారిస్తూ "పడుకో వెధవా ఇంతరాత్రయ్యింది. ఇప్పుడు కాలిస్తే పోలీసులు పట్టుకుపోతారు" అంటూ భయపెట్టింది. వాడు తిరిగి మారాం చెయ్యకుండా ఆవులించి బుద్ధిగా నిద్రపోయాడు.

రెండు జాముల వేళ తలుపు చప్పుడయ్యింది. సుగుణమణి, జగదీష్‌లు తలుపు తీశారు. కమలాకరరావే వచ్చుంటాడనుకున్నారు. కాని కాదు. ఎదురుగా ఎస్.ఐ.అతని ప్రక్కగా ఓ కానిస్టేబుల్ దర్శనమిచ్చారు. కొంప మునిగింది. మామగారేదో వెధవ పని చేసి ఉంటాడునుకుంది సుగుణమణి. ఎస్.ఐ లాఠీ ఊపుతూ "కమలాకరంగారు మీకు ఏమౌతారు?" అంటూ అడిగాడు. జగదీష్‌ని చేత్తో పొడుస్తూ సుగుణమణి నెమ్మదిగా "మనకేం కారని చెబుదురూ! లేకపోతే కేసులు, కోర్టులు, లాకప్‌లు వెధవ సంత" అని గొణిగింది. జగదీష్ అతి ప్రయత్నంమీద "మాకేం... కారు" అన్నాడు. ఎస్.ఐ "పక్కా..." అన్నాడు అనుమానంగా గుడ్లు పెద్దవి చేస్తూ. కానిస్టేబుల్ "మీకు ఆయన ద్వారా లక్షరూపాయల లాటరీ వచ్చినా ఇలాగే చెబుతారా!" అన్నాడు. అతికష్టం మీద సుగుణమణి ముఖం వైపు చూసి ఆమె ఔననమని సైగ చేస్తే "మా నాన్నగారు " అన్నాడు జగదీష్. ఎస్.ఐ లాఠీ ఊపుతూ "జగదీష్ కదూ మీపేరు. మీరు ... మీ భార్య ఆయనను సరిగా చూడ్డంలేదని ఆయన స్నేహితుడు పూర్ణచంద్రరావు స్టేషన్లో కంప్లైంట్ చేశారు. అదీగాక మీ నాన్నగారు, పూర్ణచంద్రరావు గారూ పురాణం విని వస్తూండగా మీ నాన్న గార్కి లారీ గుద్ది తలకు గాయమై సెవెన్ స్టార్స్ ఆస్పత్రిలో ఐ.సి.యు.లో పెట్టారు. తొందరగా బయల్దేరండి" అని కంగారు పెట్టాడు. సుగుణమణి ఇంతా ఊరించి చెప్పిన లాటరీ మాట వట్టిదేనా!" అని అడిగింది. అలాగంటే గాని మీరు రారని మాకు తెలుసు. ఆ పూర్ణచంద్రరావు గారే దగ్గరుండి ఆయనని ఆస్పత్రిలో జేర్పించారు. మీరు కేవలం వయస్సు మళ్ళిన ఆయన ఆస్తి మీదా, సంపాదన మీద పడి తినే డబ్బు మనుషులని కూడా ఆయనే చెప్పారు. పదండి ఆలశ్యం చెయ్యొద్దు. ఆలశ్యం చేస్తే ఆయన చావుకి కూడా మీరే కారకులౌతారు. క్విక్ నడవండి" అన్నాడు ఎస్సై. గత్యంతరం లేక ఆ భార్యాభర్తలిద్దరూ పిల్లాడిని భుజాన వేసుకుని ఇంటికి తాళం పెట్టి, పక్కవాళ్ళని చూస్తుండమని చెప్పి ఆస్పత్రికి బయల్దేరారు చలిరాత్రి .

ఆశయమే చిరంజీవి



నార్ల చిరంజీవి
ప్రచురణ : విశ్వేశ్వరరావు
వెల : 20/-, పేజీలు : 76.
ప్రతులకు :
నవోదయా పబ్లిషర్స్
కారల్ మార్క్స్ రోడ్, విజయవాడ.

చరిత్రలో ఒకో ఘట్టం ఒక జీవిత సత్యాన్ని రాజకీయ పాఠాన్ని ఎరుక పరుస్తుంటాయి. గత కొన్ని మాసాలుగా రాష్ట్రంలో కాంగ్రెస్ అనుకూల కమ్యూనిస్టు వ్యతిరేక శక్తులు అత్యంత హీనమైన స్థాయిలో సాగిస్తున్న ప్రచారాలు చూస్తున్నాము. తెలియని వారికి ఇవి ఆశ్చర్యంగానో బాధగానో వుండవచ్చు. కాని చరిత్ర తెలిసిన వారికి ఏ మాత్రం ఆశ్చర్యం కలిగించవు. ఎందుకంటే కమ్యూనిస్టు వ్యతిరేక ద్వేషం నరనరాల్లో జీర్ణించుకున్న వారు ఎంత నీచంగానైనా వ్యవహరిస్తారని తెలుగునాట యాభై ఏళ్లకిందటే రుజువై పోయింది. 1955 ఎన్నికల్లో కమ్యూనిస్టులు తమను గద్దెమీంచి తొలగించి తొలి ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటు చేసే ప్రమాదం కనిపించినప్పుడు అన్ని రకాలైన పాలకవర్గాలు వారి చేతుల్లోని అప్పటి మీడియా (అంటే పత్రికలు) బరితెగించి సాగించిన హీనాతిహీనమైన ప్రచారం చరిత్రలో చెరగని మచ్చలా మిగిలిపోయింది. ఈ దాడిలో రాజకీయ వర్గాలతో పాటు రచయితలు కవులను కూడా రంగంలోకి దింపడం, అందుకు వారు సహకరించడం అత్యంత ఘోరమైన అధ్యాయం. కమ్యూనిస్టు ఉద్యమంలో పెనవేసుకున్న వారుగాక తక్కిన పేరు మోసిన రచయతలు కవులంతా ఆ ఘట్టంలో కాంగ్రెస్ శిబిరంలో కనిపించినప్పుడు కంకణధారిగా కమ్యూనిస్టు ల పక్షాన నిల్చిన వ్యక్తి మహాకవి శ్రీశ్రీ. ఇందుకుగాను ఆయనపై ప్రత్యేకంగా దాడి జరిగింది. అది తట్టుకోలేక ఆయన మతి చలించింది కూడా. అలాంటి తరుణంలో శ్రీశ్రీకి బాసటగా కాంగ్రెస్ అనుకూల ప్రజాస్వామ్య ప్రచారకులపై కలాన్ని కత్తిలా ఉపయోగించిన రచయిత నార్లచిరంజీవి. తెలుగు పూలు తో తెలుగింట ప్రతివారికీ పరిచితుడైన చిరంజీవి ఆ సమయంలో బూటక ప్రచారాలను నిలువునా కడిగేస్తూ సవివరమైన జవాబు రాశాడు. తమ దుష్ప్రచార కాండలో గొంతు కలపవలసిందిగా కోరుతూ సంతకం కోసం పాలగుమ్మి పద్మరాజు తనకు పంపిన సంయుక్త ప్రకటనకు బదులుగా చిరంజీవి పెద్ద లేఖ రాశాడు. "ప్రజాస్వామ్యాన్ని హఠాత్తుగా ప్రేమిస్తున్న రచయితలకు లేఖ" పేరుతో రాసిన దాన్ని 1955 ఫిబ్రవరి 7న విశాలాంధ్ర పత్రిక ప్రచురించింది. కమ్యూనిస్టు వ్యతిరేక శక్తుల ప్రేరణతో రూపొందిన సంయుక్త ప్రకటనలోని ప్రతి అంశాన్ని చిరంజీవి చీల్చి చెండాడాడు. లోగడ దొంగదాడి పేరుతో నాటి పత్రాలను ప్రకటనలను ప్రచురించిన విజయవాడ శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరరావు "అగ్ని సరస్సున వికసించిన వజ్రం నార్ల చిరంజీవి" పేరుతో విడిగా మరో పుస్తకం తీసుకొచ్చారు. "చిరంజీవి మామయ్య కోసం" అంటూ రాసిన ముందు మాటలో ఆయనతో తన అనుబంధాన్ని, ఆయన ఆశయ నిబద్ధతను ప్రస్తావించారు.

75 పేజీల ఈ పుస్తకంలో చిరంజీవి లేఖతో పాటు నాడు తెలుగు నాట సాగిన కాంగ్రెస్ దమన కాండను, కాటూరు యలమర్రులలో సామూహికంగా ప్రజలను వివస్త్రులను చేయడంపై ప్రతిధ్వనించిన ఖండనలు వగైరాలను పొందుపర్చారు. దాంతోపాటే ఈ విషయాలపై కెవిఎస్‌వై పతంజలి, కె.శివారెడ్డి వంటి వారి ప్రతిస్పందనలను కూడా ఇచ్చారు. కాటూరు యలమర్రు దురంతాలపై హరీన్ చటోపాధ్యాయ గేయాన్ని, శ్రీశ్రీ మహాసంకలనం కవితనూ, చిరంజీవి రాసిన సుప్తాస్తికలు రూపకాన్ని కూడా పొందుపర్చారు. ఇవన్నీ బాగానే వున్నాయి గాని ఈ పుస్తకానికి వరవరరావు ముందు మాట దాని స్పూర్తితో పొసిగేదేనా అని సందేహం. దాడి చేసిన పాలకవర్గాలపై కన్నా పోరాడిన కమ్యూనిస్టులపై ఎక్కువగా విమర్శలు చేయడానికి ఆయన ప్రాధాన్యతనివ్వడం కనిపిస్తుంది. నాటి పోరాటం నడిపించిన కమ్యూనిస్టు నాయకులపైన గౌరవం లేనివారు ఆ చారిత్రిక పాఠాలను అర్థం చేసుకోవడం కష్టమే. నంబూద్రిపాద్‌కూ డాంగేకు తేడా చూడలేనివారు, ఎన్‌డిఎ, యుపిఎ సిపిఎం లను ఒకే గాట కట్టేవారు చరిత్రపై తీర్పరులు కావడం పెద్ద విషాదమే. ప్రత్యేకంగా పుస్తకం తెచ్చారు గనుక చిరంజీవి జీవిత విశేషాలు విడిగా ఇస్తే బావుండేది. నిరాండబరుడైన కమ్యూనిస్టు అభిమాని, తన తండ్రి వల్లూరిపల్లి నాగభూషణంకు ఈ పుస్తకం అంకితం చేయడం హర్షణీయం.

- తె.ర

కొత్త పుస్తకాలు

నాటక విజ్ఞాన దర్పణం



నాటక శిల్పం
ఆచార్య మొదలి నాగభూషణ శర్మ
వెల : 80/-, పేజీలు : 200.
ప్రతులకు :
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్-500001

కళలన్నిటి సమాహారం నాటకం. పల్లెల్లో తిరణాలల నుంచి పాఠశాలల వార్షికోత్సవాల వరకూ నాటకాలు వేస్తూనే వుంటారు. సాంకేతిక తేడాలున్నా చలన చిత్ర కళ కూడా మౌళికంగా నాటక ప్రక్రియ విస్తరణ వంటిదే. భారతీయ నాటక శిల్ప సిద్ధాంతాలు చాలా సమగ్రమైనవి. అదే సమయంలో నాటకాన్ని ఆధునిక రూపంలో చూసిన పాశ్చాత్య సిద్ధాంతాలు ఆసక్తికరమైనవి. కళలు విశ్వజనీనాలు గనక వీటన్నిటినీ ఆకళింపు చేసుకోవడం ద్వారానే నేటి కళాకారులు నాటక ప్రక్రియలో రాణించగలుగుతారు. అనుకున్న సందేశాన్ని ప్రేక్షక హృదయాల్లో జొప్పించగలుగుతారు. కళా సాహిత్య రంగాలలో నిష్ణాతుడూ, విస్తారంగా రచనలు చేసిన అధ్యాపకుడు ఆచార్య మొదలి నాగభూషణ శర్మ రాసిన "నాటక శిల్పం" పుస్తకం అందుకు ఎంతైనా దోహదపడుతుంది. 40 ఏళ్లుగా వివిధ విశ్వవిద్యాలయాల్లో నాటకకళలపై బోధిస్తున్న నాగభూషణ శర్మ నాటక రచనలోనూ, బోధనలోనూ విశ్లేషణలోనూ సిద్ధహస్తులు. 25కు పైగా స్వంత నాటకాలూ, 25 వరకూ వివిధ భాషల అనుసరణలూ అనువాదాలు వెలువరించారు. వారు రాసిన తెలుగు నవలా వికాసం ఒక ప్రామాణికగ్రంథం. అదే రీతిలో ఇప్పుడు భారతీయ పాశ్చాత్య నాటక రచనా సంవిధానం, విభిన్నప్రక్రియా విశేషాలు, విమర్శనాత్మక వివరణ, రేడియో, టీవీ సినిమా వగైరా మాధ్యమాల తులనాత్మక పరిశీలనలతో 200 పేజీల ఈ పుస్తకం అందించారు. ఒక్కో భాగంలోనూ దర్పణం వివిధ రకాలైన నిర్వచనాలు, సిద్ధాంతాలు, విభిన్న వాదనలు, చరిత్ర ఇచ్చారు. సంప్రదాయ నాటకాల నుంచి నేటి వీధి నాటకాల వరకూ వాటి వాటి విలక్షణతను ఎరుక పర్చారు. వాస్తవ జీవితంలో వ్యవహారానికి రంగస్థలంపై నటించడానికి మధ్య తేడా ఏమిటో కూడా చక్కగా వివరించారు. నాటకం అనేది కేవలం ప్రదర్శనకు మాత్రమే సంబంధించింది కాదు. దానిలో సాహిత్య భాగమూ వుంటుంది. వాటి పరస్పర సంబంధాన్ని కూడా రచయిత విశదపర్చారు. అందుకే ఈ పుస్తకం కళాకారులకేగాక రచయితలకూ సాహిత్యాభిమానులకూ కూడా చక్కటి కానుక.

- పీపీ



అతిపురాతన అండ

అబ్బో ఈ అండాకు కాస్త అతి ఎక్కువే.
ఎలాగంటారా. ఇది అతి పురాతనమైనది.
అంతేకాదండోయ్ అతి పెద్దది.
మడగాస్కర్‌లో 400 ఏళ్ల క్రితం
ప్రపంచంలోకెల్లా అతి పెద్ద పక్షి పెట్టిన గుడ్డు
ఇది. సింపుల్‌గా పది అడుగుల
పొడవుంటుంది. బరువంటారా?
జస్ట్ అరటన్ను



ఆర్ట్ అదిరెనులే

నిజ్జం కదా! ఏ పనిచేసినా కూసింత
కళాపోసనుండాలండీ... ఈ ఫోటోలు చూడం[illegible]లెడన్ని
చిన్న చిన్న బొమ్మలను కలిపేసి ఏకంగా కళాఖండా[illegible]నే
సృష్టించేశారు. ఎవరు వారు? ఎచటి వారు? అని మాత్రం
అడక్కండే. అదిరేటి ఆర్ట్ పీసులు చూసి
ఆనందించండి చాలు.

విజ్ఞత



అబ్బో ఇది చాలా చాలా పాత కథ. అప్పుడు ఓ గ్రామంలో నలుగురు స్నేహితులు వుండేవారు. నలుగురూ బ్రాహ్మణ కుటుంబాల వారే. అయితే అందులో ముగ్గురు మాత్రమే గురువుల దగ్గర చదువు పూర్తిచేశారు. పేదరికం వల్ల ఒకరికి చదువుకునే అవకాశం కలగలేదు. అయితేనేం వారి స్నేహానికి అదేమాత్రం ఆటంకం కాలేదు. నలుగురూ ఎప్పుడూ కలిసే వుండేవారు. ఓసారి వారికి ఓ ఆలోచన వచ్చింది. తమకు వచ్చిన విద్యతో... దేశాటన చేస్తూ బాగా డబ్బు సంపాదించాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా పెద్దల దగ్గర సెలవు తీసుకుని బయలుదేరారు. ఎన్నో గ్రామాలు, పట్టణాలు, నగరాలు తిరిగారు. బాగా డబ్బు సంపాదించారు. ఇక తిరుగు ప్రయాణం అయ్యారు.

మార్గమధ్యలో పెద్ద అడవి దాటాల్సి వచ్చింది. ఆ అడవి బోలెడంత దట్టంగా వుంది. పెద్ద పెద్ద వృక్షాలు, వాటిని అల్లుకున్న బలమైన తీగలు... వాటి మధ్యలో కాలి బాట మాత్రమే వుంది. ఆ బాట మీదగా నలుగురు మిత్రులూ కలిసి ప్రయాణం మొదలెట్టారు. విసుగు పుట్టకుండా కబుర్లు చెప్పకుంటూ ముందుకు నడుస్తున్నారు. సరిగ్గా అప్పుడు పెద్ద వృక్షం కింద శిథిలావస్థలో వున్న పులి కళేబరం కనిపించింది. అయితే అది ముక్కలు ముక్కలుగా విడిపోయి వుంది. దాన్ని చూసేసరికి విద్యావంతులైన ముగ్గురు స్నేహితులకు ఒక ఆలోచన వచ్చింది. తమ విద్యలతో దానికి ప్రాణం పోయాలనుకున్నారు. అందులో ఒకరికి ఏ ప్రాణి ఎముకలనైనా పొందికగా అమర్చడం వచ్చు. మరొకరు దానిమీద మాంసాన్ని, చర్మాన్ని ఏర్పాటు చేయగలరు. మూడవ వాడు దానికి ప్రాణం పోయగలడు. ఇదే చెప్పారు వారు గర్వంగా. అయితే ఇదంతా విన్న నాల్గవ వాడు మాత్రం భయపడిపోయి

“బాబులూ! కాస్త ఆలోచించండి. అది పులి. దానికిగాని ప్రాణం వచ్చిందంటే మన నలుగురినీ పప్పచారులో అప్పడాల్లా నంజుకు తింటుంది. ఆ పైన మీ ఇష్టం” అన్నాడు.

దానికి మిగతా ముగ్గురూ బిగ్గరగా నవ్వుతూ...“ఓరి నిరక్షర కుక్షీ...దీనికే ఇంత ఇదైపోతున్నావెందుకు? ముందు మా విద్యను ప్రదర్శించనివ్వు. ఇంత చేసిన వాళ్లం నిన్ను కాపాడలేమా! ధైర్యంగా వుండు” అన్నారు.

“సరే అయితే ముందు నన్ను ఈ చెట్టు ఎక్కనివ్వండి. ఆ తర్వాత మీరు మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి” అంటూ గబగబా చెట్టు పైకి పాకేశాడు. అక్కడే వుండి వారు చేసేది భయం భయంగా చూడసాగాడు.

ఒకడు పులి ఎముకలన్నింటిని ఒకచోటికి పోగు చేసి చిన్నా పెద్దా ఎముకలను విభజించి వరుసగా పులి ఆకారంలో పేర్చాడు. అప్పటికి అతనికి చెమటలు పోసేశాయి. అయితేనేం అంతా అయ్యాక నుదుటిన పట్టిన చెమట తుడుచుకుంటూ విజయగర్వంతో మిగతా ముగ్గురివైపు చూశాడు.

నాలుగోవాడు మాత్రం చెట్టుపైనుండే చూసి చప్పట్లు కొట్టాడేకానీ భయంగానే వుంది మనసులో.

మిగతా ఇద్దరూ “ఇక మా పనితనం చూడు” అన్నట్టు ముందుకు వచ్చారు. ఒకడు దానికి మాంసం, పైచర్మం ఏర్పాటు చేశాడు. తర్వాత మూడవ వాడు దానికి ప్రాణం పోశాడు. అంతే...పులి ఒక్కసారి నిద్రలోంచి లేచినట్టు లేచి...ఒళ్లు విరుచుకుని పెద్దగా ఆవులించి...గాండ్రించుకుంటూ...పరిసరాలను పరిశీలించసాగింది. దాని వాలకం చూస్తే మాంచి ఆకలి మీదున్నట్టుంది. కనబడినవారిని కనబడినట్టు చప్పరించేసేట్టుంది. చెట్టుమీది నాలుగోవాడు వణికిపోసాగాడు. కాళ్లూచేతులూ టకటకా కొట్టుకోసాగాయి. అయితే మిగిలిన ముగ్గురూ ఇదేం పట్టించుకునే స్థితిలో లేరు. ఎంతసేపటికీ తాము నేర్చుకున్న విద్యను చక్కగా ప్రదర్శించామన్న విజయగర్వంలోనే వున్నారుగానీ...దాని వెనుక దాగివున్న ప్రమాదాన్ని వారు గమనించే స్థితిలో లేరు.

పులి మాత్రం వారిమీద దాడి చేసి శుభ్రంగా చప్పరించేసింది. ఇదంతా చూడలేక నాలుగవ వాడు మాత్రం చెట్టుమీదే కళ్లుమూసుకుని అలా వుండిపోయాడు. తాము నేర్చుకున్న విద్యను ప్రదర్శించడంపైనే దృష్టిపెట్టారుగానీ దాని పర్యవసానాలను వారు విజ్ఞతతో అర్థంచేసుకోలేకపోయారు. దాని ఫలితంగా ప్రాణాలే కోల్పోవలసి వచ్చింది. అస్సలు అక్షరం ముక్క తెలియని వాడు మాత్రం విజ్ఞతతో ఆలోచించి ప్రాణాలను కాపాడుకున్నాడు. విద్య వుంటే సరిపోదు దానికి తగ్గ విజ్ఞతకూడా వుండాలి.

- చూటీ